జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 6 సంచిక 97 | హైదరాబాద్, జనవరి 31 మంగళవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

# రాష్ట్ర ప్రభుత్వం రాజీ..

## సర్దుమణిగిన గవర్నర్ వర్సెస్ కేసీఆర్ వివాదం

## గవర్నర్ విధుల్లో న్యాయ సమీక్ష చేయొచ్చా?: హైకోర్టు వ్యాఖ్య



ప్రజాపాలన బ్యూరో న్యూస్, జనవరి 30,తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై సందిగ్ధత నెలకొంది. బడ్జెట్‌ను గవర్నర్ ఆమోదించకపోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వెళ్లింది. ఈ సందర్భంగా కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇదీలాఉండగ ప్రభుత్వం ఒక మెట్టు దిగివచ్చి రాజీ కుదుర్చుకున్న నేపథ్యంలో కోర్టు జోక్యం లేకుండానే వివాదం సద్దుమణిగింది.

**అసలేం జరిగిందంటే.....**

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా కేసీఆర్ కు గవర్నర్ లో మధ్య వివాదం కొనసాగుతుంది. గణతంత్ర దినోత్సవం జరుపుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వైఖరి పై కోర్టు కు వెళ్ళవలసి వచ్చింది. ఐనా ఎవరిపంతం వారు నెగ్గించుకున్నారు. ఈ క్రమంలో గవర్నర్ ప్రసంగం లేకుండా నే శాసనసభ లో బడ్జెట్ ప్రవేశపెట్టాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. మళ్ళీ గవర్నర్ వర్సెస్ కేసీఆర్ వార్ మొదలైంది. దీనిని గవర్నర్ చాకచక్యంగా వాడుకున్నారు. బడ్జెట్ పై గవర్నర్ ఆమోదం (సంతకం) చేయకుండా బడ్జెట్ పై గవర్నర్ ప్రసంగం ఉంటుందా లేదా అని ప్రభుత్వం ను స్పష్టం చేయాలని కోరడంతో గవర్నర్ ప్రసంగం ఇష్టం లేని కేసిఆర్ సర్కారు న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది.

**గవర్నర్‌కు కోర్టు నోటీసు ఇవ్వగలదా?**

ఈ ఏడాది బడ్జెట్‌ను శాసనసభ, మండలిలో ప్రవేశపెట్టేందుకు గవర్నర్ తమిళిసై ఆమోదం తెలపకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. బడ్జెట్‌నుప్రవేశపెట్టేందుకు అనుమతిచ్చేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు విచారణ జరిపేందుకు సీజే ధర్మాసనం అంగీకరించింది. ఈ సందర్భంగా హైకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.'ఈ విషయంలో గవర్నర్‌కు కోర్టు నోటీసు ఇవ్వగలదా? ఆలోచించుకోండి. గవర్నర్ విధుల్లో కోర్టులు న్యాయసమీక్ష చేయొచ్చా? కోర్టులు మితిమీరి జోక్యం చేసుకుంటున్నాయని మీరే అంటారు కదా?" అని అడ్వకేట్ జనరల్ (ఏజీ)ను ఉద్దేశించి ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌పై జరిగే విచారణలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తారని ఏజీ తెలిపారు. 2023-24 బడ్జెట్‌ను అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండగా.. దానికి గవర్నర్ తమిళిసై ఆమోదం తెలపకపోవడంతో అధికార వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మరో నాలుగు రోజులే సమయం ఉండటంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. గవర్నర్ సమ్మతి తర్వాతే బడ్జెట్‌ను మంత్రిమండలి ఆమోదిస్తుంది. అనంతరం శాసనసభ, మండలిలో ప్రవేశపెడ తారు. ముసాయిదా బడ్జెట్ ప్రతులను మూడురోజుల క్రితమే ప్రభుత్వం గవర్నర్ కార్యాలయానికి పంపించింది. ఇప్పటివరకు గవర్నర్ ఆమోదించలేదనిప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇదీలాఉండగ ప్రభుత్వం ఒక మెట్టు దిగివచ్చింది. గవర్నర్ కు బడ్జెట్ ప్రసంగం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం తెలుపిన నేపథ్యంలో కోర్టు జోక్యం లేకుండా నే వివాదం సద్దుమణిగింది. ఐతే తెలివైన కేసిఆర్ తప్పుడు నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారని మేధావి వర్గం నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.



## మసీదులో ఆత్మాహుతి దాడి..

**28 మంది మృతి..150 మందికి పైగా గాయాలు**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. పోలీస్ లైన్స్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం మసీదులో ప్రార్థనల సమయంలో ఈ పేలుడు సంభవించినట్టు పోలీసులు వెల్లడించారు. ఈ దాడిలో 28 మందికిపైగా మృతి చెందగా.. సుమారు 150 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం ప్రార్థనల సమయంలో పేలుడు జరిగినట్లు పోలీసులు, స్థానికులు చెబుతున్నారు. మసీదులో ఓ వ్యక్తి తనతంట తాను పేల్చుకున్నట్లు భావిస్తున్నారు. తొలి వరుసలో ఉన్న వ్యక్తి ఆత్మాహుతికి పాల్పడినట్లు అంచనా వేస్తున్నారు. జోర్ ప్రార్థనలు జరుగుతున్న సమయంలో దాడి జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు.మరోవైపు పేలుడు జరిగిన ప్రదేశాన్ని పోలీసులు సీజ్ చేశారు. కేవలం అంబులెన్స్‌లను మాత్రమే అనుమతిస్తున్నారు. పేలుడు ధాటికి భవనం పూర్తిగా దెబ్బతిందని.. భవనం కొంత భాగం కుప్పకూలి పోగా ఆ శిథిలాల కింద కొందరు చిక్కుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

## తెలంగాణలోని రైల్వే ప్రాజెక్టుల పట్ల కేంద్రం వివక్ష : కేటీఆర్



హైదరాబాద్ : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై మంత్రి కేటీఆర్ రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు లేఖ రాశారు. తెలంగాణలోని రైల్వే ప్రాజెక్టులకు ప్రతీ బడ్జెట్‌లో జరిగిన తీవ్రమైన అన్యాయాన్ని లేఖలో కేటీఆర్ ప్రస్తావించారు. కనీసం ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తగినన్ని నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ప్రారంభమైన పలు రైల్వే ప్రాజెక్టులతో పాటు ప్రతిపాదిత రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైనన్ని నిధులు ఇవ్వాలని అనేకసార్లు తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని లేఖలో కేటీఆర్ గుర్తుచేశారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతీ బడ్జెట్ లోనూ రైల్వే ప్రాజెక్టుల నిధుల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన వివక్ష కొనసాగుతున్నదని కేటీఆర్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 6 నెలల్లోనే కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని పునర్విభజన చట్టంలో (మిగతా 7లో..)

## చావనైనా చస్తాగానీ బీజేపీతో మళ్లీ పొత్తు పెట్టుకోను: బీహార్ సీఎం నితీశ్‌కుమార్



పట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ బీజేపీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను చావనైనా చస్తానుగానీ బీజేపీతో మరోసారి పొత్తు పెట్టుకోనని తెగేసి చెప్పారు. బీహార్‌లో మహా కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ చేయని కుట్ర లేదని ఆయన ఆరోపించారు. ఆర్జేడీ అగ్రనేత, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వియాదవ్‌పైన, ఆయన తండ్రి లాలూప్రసాద్ యాదవ్‌పైన బీజేపీ తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నదని విమర్శించారు.తేజస్విపై, లాలూపై బీజేపీ మోపిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. ఆర్జేడీని నేతలను వేధించడం ద్వారా కూటమిని విడదీస్తే తాను తిరిగి వాళ్ల దారికి వెళ్తానని బీజేపీ నేతలు భావిస్తున్నారని ఆరోపించారు. నితీశ్ కుమార్‌కు మరో గత్యంతరం లేదని, వచ్చే ఎన్నికల్లో తిరిగి తమతో పొత్తు పెట్టుకుంటారని బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా నితీశ్ పైవిధంగా స్పందించారు.ప్రజాధరణ కోల్పోయిన నితీశ్‌కుమార్ మళ్లీ బీజేపీతో దోస్తీకి ప్రయత్నిస్తారని, అయితే నమ్మద్రోహి అయిన నితీశ్ చేతిలో మరోసారి మోసపోయేందుకు తాము సిద్ధంగా లేమని బీహార్ బీజేపీ అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీహార్లో బీజేపీ మొత్తం 40 స్థానాలకుగాను 36 స్థానాల్లో గెలుస్తుందని చెప్పారు.అయితే, లోక్‌సభ ఎన్నికల్లో 36 స్థానాలు గెలుస్తామన్న బీజేపీ నేతల వ్యాఖ్యలపై కూడా నితీశ్ స్పందించారు. జేడీయూతో పొత్తు ఉన్నప్పుడు బీజేపీ ఐడియాలజీని తీవ్రంగా వ్యతిరేకించే ముస్లిం సమాజం కూడా వారికి ఓట్లు వేసిందని, ఈసారి అలా జరగదని చెప్పారు. బీజేపీ అలాంటి ఆశలు పెట్టుకుంటే అడియాశలే అవుతాయని ఎద్దేవా నితీశ్‌కుమార్ చేశారు.

# బహుజన రాజ్యాధికారం పార్స్ తోనే సాధ్యం...

### పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితిపార్స్ బాటలో బహుజనులు... పది లక్షల సంతకాల సేకరణకు వెల్లువెత్తిన బహుజన నాయకులు, కార్యకర్తలు...



విజయవాడ 30 జనవరి(ప్రజాపాలన ప్రతినిధి): బహుజన రాజ్యాధికారం ఒక్క పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి(పార్స్ )తోనే సాధ్యమని అందుకే బహుజనులు పార్స్ కు బ్రహ్మరథం పడుతున్నారని, పార్స్ చేపట్టిన పది లక్షల సంతకాల సేకరణకు వెల్లువెత్తుతున్న బహుజన అభిమానమే ఇందుకు తార్కాణంగా పార్స్ నాయకులు విశ్లేషిస్తున్నారు. విజయవాడ స్నేహ టీవీ ఛానల్ కార్యాలయంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి భవిష్యత్ కార్యాచరణ పై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సును నిర్వహించిన కార్యక్రమంలో పార్స్ నాయకులకు అధినాయకత్వం కొన్ని సూచనలు చేసింది.పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి నియమ నిబంధనలు బహుజనులకు వివరంగా తెలియపరచగలిగాలని,అంతేకాక కుల సంఘాలు కుల సంఘాల్లో పనిచేస్తున్న ప్రజలకు మన నియమ నిబంధనలు వివరంగా తెలవాలి పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితిలో కుల న్యాయం పాటించే విధంగా నియమాలు ఉన్నాయని వివరించగలిగితే సంతకాల సేకరణలో ఇబ్బందులు రాకపోవచ్చున్నారు. షెడ్యూల్ కులాల విషయానికొస్తే సబ్ ప్లాన్ నిధులు 22 వేల కోట్లు రావాలి అవన్నీ ఏ రూపాలలో దారి మళ్లాయో వాటి విషయాలను వివరంగా చెప్పగలిగితే సంతకాల సేకరణ కు షెడ్యూల్ కులాల వారు ముందుండి చేస్తారని,అట్రాసిటీ కేసులను మన ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిపై కూలంకుశంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవచ్చని ఈ విషయాలపై ఎవరైనా అడిగితే వారికి కూడా వివరంగా తెలియపరిచి సంతకాలు చేయించే విధంగా మన ప్రవర్తన ఉండాలని ఆ విధంగా ప్రతి ఒక్కరు నాయకులుగా ఎదగాలి అని నాయకులుగా ఎదిగిన వారిని మొదటగా మన సభ్యులు గుర్తించి గౌరవించాలని అన్నారు. (మిగతా 2లో..)

## పలు ఉద్యోగ నియామక పరీక్షల తేదీలను ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ



హైదరాబాద్ :పలు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్షల తేదీలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం ప్రకటించింది. వ్యవసాయ అధికారి నియామక పరీక్ష ఏప్రిల్ 25న నిర్వహించనున్నట్లు పేర్కొంది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన పరీక్షను మే 7న, పాలిటెక్నిక్ లెక్చరర్ల నియామక పరీక్ష మే 13న, ఇంటర్ సాంకేతిక విద్యాశాఖలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి 17న, ఇంటర్ కమిషనరేట్‌లో లైబ్రేరియన్ల పోస్టుల భర్తీకి 17న నిర్వహించనున్నట్లు చెప్పింది. అయితే, పరీక్షలన్నీ ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తామని స్పష్టం చేసింది. 18 డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ల నియామకానికి గత డిసెంబర్‌లో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విధితమే. దాంతో పాటు 247 లెక్చరర్ల పోస్టులకు, సాంకేతిక విద్యలో ఫిజికల్ డైరెక్టర్ 37, ఇంటర్మీడియట్ విద్యలో ఫిజికల్ డైరెక్టర్ 91 పోస్టులు, ఇంటర్ కమిషనరేట్‌లో 40 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి గత నెలలో వేర్వేరుగా టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు దరఖాస్తులను స్వీకరించింది. ఇప్పటికే దరఖాస్తు గడువు ముగిసింది. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణ తేదీలను ప్రకటించింది.

పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
ఆహ్వానం
డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ తొలి పత్రిక మూక్ నాయక్ ను స్థాపించి 102 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా
Topic:
Constitutional protection & Government Role to Dalith Media
దేశ వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ & ప్రింట్, యూట్యూబ్, సోషల్ మీడియాలలో ఉన్న బహుజన ఓనర్లకు జరప తలపెట్టిన అభినందన కార్యక్రమానికి
ముఖ్య అతిధులు
డా.భీమారావ్ యశ్వంత్ అంబేడ్కర్
నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అండ్ నేషనల్ ప్రెసిడెంట్,సమతా సైనిక్ దళ్
కెప్టెన్ ప్రవీణ్ నిఖాడె: ట్రస్టీ ఫర్ ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా
డా.జే.బీ రాజు IIS-vrs : నేషనల్ ప్రెసిడెంట్ (PARS)
పాశం యాదగిరి : Journalist, activist and Convenor of the Telangana Aikya Karyacharana Samiti.
సతీష్ చందర్: Editor Great Andhra, Formarly Chif editor of Andhra Prabha Daily, co founder Editor Vaartha
Time : 10.30AM To 5.30PM
Date : 31st January 2023
Venue: DICCI Office 4th Floor Samrat Complex,Opp.AG Office Hyderabad



మీ
డాక్టర్ కటికల శివభాగ్యారావు బహుజన్, IRS-vrs
PARS నేషనల్ కన్వీనర్
ఫౌండర్ & ఛైర్మన్
స్నేహ టీవీ, మాస్టర్ కీ టీవీ, ప్రజాపాలన

## ఢిల్లీలో స్లీపర్ సెల్స్... ఐబీ వార్నింగ్

న్యూఢిల్లీ, జనవరి 30, :దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఢిల్లీలో ఖలిస్థాన్ ఉగ్ర నెట్‌వర్క్ స్లీపర్ సెల్స్ యాక్టివ్ గా పనిచేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ సంస్థలు హెచ్చరికలు జారీచేశాయి. ఇటీవల ఢిల్లీలోని చాలా చోట్ల ఖలిస్థాన్‌కు మద్దతుగా పెయింటింగ్‌లు, గోడలపై రాతలు కనిపిస్తున్నాయి నిఘా వర్గాలు తెలిపాయి. వికాశ్‌పురి, జనక్‌పురి, పశ్చిమ్ విహార్, పీరాగర్హ్వా, పశ్చిమ ఢిల్లీలోని ఇతర ప్రాంతాల్లో ఖలిస్థాన్ కు మద్దతుగా రాతలు కనిపించాయి. పోలీసులు వీటిని తొలగించారు. ఢిల్లీలో ఖలిస్థాన్ ఉగ్రసంస్థ దాడులకు పాల్పడే అవకాశం ఉందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఖలిస్థాన్ స్లీపర్ సెల్స్, టెర్రర్ నెట్‌వర్క్‌లు యాక్టివ్‌గా ఉన్నట్లు నిఘా సంస్థలు తెలిపాయి. గత కొద్ది రోజులుగా పశ్చిమ ఢిల్లీలో ఖలిస్థాన్ అనుకూల పోస్టర్లు, పెయింటెడ్ గ్రాఫిటీలు కనిపిస్తున్నాయి. జనవరి 12న దేశ రాజధానిలో ఖలిస్థాన్ అనుకూల పోస్టర్లు వేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలో ఖలిస్థాన్ స్లీపర్ సెల్స్ ఉగ్రదాడులకు పాల్పడే అవకాశం ఉందని జాతీయ మీడియా తెలిపింది. వికాశ్ పురి, జనక్‌పురి, పశ్చిమ్ విహార్, పీరాగర్హ్వాతో పాటు పశ్చిమ ఢిల్లీలోని ఇతర ప్రాంతాల్లో అభ్యంతరకర నినాదాలతో కనిపించిన గ్రాఫిటీలు పెద్ద కుట్రలో భాగం కావచ్చని నిఘా వర్గాలు భావిస్తున్నాయి.దేశ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేందుకు నిధులు అందాయని అరెస్టైన నిందితులు పోలీసులకు తెలిపారు. తదుపరి విచారణ కొనసాగుతుందని పోలీసులు చెప్పారు. ఖలిస్థాన్ అనుకూల పోస్టర్లను స్థానిక పోలీసులు తొలగించి గోడలకు రంగులు వేశారు. గోడలపై ఖలిస్థాన్ అనుకూల రాతలు రాసిన ఘటనలో రెండు గ్రూపుల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం (153-ః), నేరపూరిత కుట్ర (120-ః) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి సీసీ కెమెరాల ఫుటేజీని కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. దేశ రాజధానిలో శాంతి, సామరస్యాలకు భంగం కలిగించేలా ఖలిస్థాన్ ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారని నిఘా వర్గాల నుంచి వచ్చిన హెచ్చరికలతో పోలీసులు అలెర్ట్ అయ్యారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముందు సిక్ ఫర్ జస్టిస్ (ూఈఏ) ఉగ్రవాద సంస్థకు చెందిన గురుపత్వంత్ సింగ్ విడుదల చేసిన ఓ వీడియో కలకలం రేపింది. రిపబ్లిక్ డే రోజున ప్రత్యేక పంజాబ్ అనుకూల సంస్థ ఎస్ఎఫ్‌జే ఉగ్రదాడులకు పాల్పడుతుందన్నది ఓ వీడియో సారాంశం. జనవరి 26న ఇళ్లల్లోనే ఉండండి, లేదంటే భారీ మూల్యం తప్పదంటూ ఉగ్రవాదులు హెచ్చరించారు. దేశ రాజధాని ఢిల్లీనే మా లక్ష్యం అదే రోజు ఖలిస్థాన్ జెండాను ఆవిష్కరిస్తామని గురుపత్వంత్ సింగ్ వీడియోలో చెప్పాడు.

## కవిత ఈ సారి ఎంపీగా పోటీ చేస్తారా..?



నిజామాబాద్, జనవరి 30, :నిజమాబాద్ ఎంపీగా కవిత పోటీ ఈసారి పోటీ చేస్తారా? చేయరా? ఇదే గులాబీ పార్టీలో చర్చనీయాంశమైంది. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ పార్టీగా మార్చిన తర్వాత 2024లో లోక్‌సభ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత నిజామాబాద్ ఎంపీగా పోటీ చేస్తారా? అన్న దానిపైనే ఎక్కువ మంది చర్చించుకుంటున్నారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ఇప్పటికీ కవిత పర్యటిస్తూనే ఉన్నారు. అక్కడ జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటున్నారు. నిజామాబాద్ కుచెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తరచూ కవితతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తున్నారు దీన్ని బట్టి ఈసారి నిజామాబాద్ పార్లమెంటు నుంచి పోటీ చేయడానికి కవిత రెడీగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిజామాబాద్ నేతల అంచనా కూడా అదే. ఎందుకంటే 2019 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత కవిత కొన్నాళ్లు ఎలాంటి పదవి లేకుండానే ఉండిపోయారు. అయితే ఆ తర్వాత భూపతి రెడ్డి పార్టీని ఫిరాయించడంతో ఏర్పడిన ఉప ఎన్నికల్లో ఆమె ఎమ్మెల్సీగా పోటీ చేసి శాసనమండలిలోకి ప్రవేశించారు. తొలుత కల్వకుంట్ల కవిత అసెంబ్లీకి పోటీ చేస్తారని కూడా మొన్నటి వరకూ గులాబీ పార్టీలో ప్రచారం జరిగింది. కానీ కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని ప్రకటించిన తర్వాత కవిత అవసరం ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటుందని అధినేత కూడా నమ్ముతున్నారట. కవిత 2014 ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంటు స్థానం నుంచే పోటీ గెలుపొంది లోక్‌సభలో కాలుమోపారు. ఐదేళ్ల పాటు తెలంగాణ డిమాండ్లను బలంగా లోక్‌సభలో వినిపించారు. ఢిల్లీలో ఇతర పార్టీల అగ్ర నేతల పరిచయాలు కూడా కవితకు ఎక్కువగానే ఉన్నాయి. బీఆర్ఎస్ పెట్టిన పరిస్థితుల్లో తనకు చేదోడు వాదోడుగా ఢిల్లీలోనే ఉంటే బాగుంటుందని ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ పార్టీని, ప్రభుత్వాన్ని కేటీఆర్ కు అప్పగించి తాను ఢిల్లీకి వెళ్లి దేశ రాజకీయాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారని తెలిసింది.గత ఎన్నికల్లో ఆమె ఓటమి పాలయినా ఈసారి గెలుపు సులువవుతుందని భావిస్తున్నారు. ఈసారి ట్రయాంగల్ ఫైట్ ఉండటంతో తన గెలుపు నల్లేరు మీద నడకేనని కవిత కూడా భావిస్తున్నారు. గత ఎన్నికలలో మాదిరి బీజేపీకి ఏకపక్షంగా ఓట్లు పడవని, ఎంపీ ధర్మపురి అరవింద్ పైన కూడా ఉన్న అసంతృప్తి తన విజయానికి కారణమవుతుందని భావిస్తున్నారని సమాచారం. తండ్రి వెంటే దేశ రాజకీయాల్లో తోడుగా ఉండాలని కవిత సయితం భావిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎటూ పదవీ కాలం పూర్తవుతుంది. అంతే కాకుండా అది స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కావడంతో మరొక నేతకు అవకాశమిచ్చి తాను నిజామాబాద్ పార్లమెంటుకు పోట ?చేయాలని, దేశ రాజకీయాల్లో కీలకంగా మారాలని కవిత భావిస్తున్నారని సమాచారం.

# బహుజన రాజ్యాధికారం పార్స్ తోనే సాధ్యం...

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాక ప్రతి నాయకుడు మండల స్థాయి నుండి పార్లమెంటు స్థాయి వరకు నాయకులను నియమించి మీతో కలిసి రాష్ట్ర నాయకులు శక్తి వంచన లేకుండా సంతకాల సేకరణలో పాల్గొనగలిగితే వారి ద్వారా రాబోవు రోజులలో గ్రామస్థాయిలలో కూడా పార్సు నియమ నిబంధనలను బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఆ విధంగా సంతకాల సేకరణను సులభతరం చేయవచ్చన్నారు. ముఖ్యంగా నియమాలలో ఒకటి అయినా ఓసీలకు ఏబిసిడి వర్గీకరణ 15 శాతంగా ఉన్న కాపులకు అంతే శాతం రిజర్వేషన్, ఈ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ వర్గం స్వతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ముఖ్యమంత్రి పదవి చేపట్టలేదు కనుక పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి అనే ముఖ్యమైన నినాదాన్ని ప్రజల ముందుంచింది. ఒక్కసారి పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో బీసీ అభ్యర్థి ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర ప్రజానీకం మొత్తానికి సమన్యాయం చేయగలిగే తొలి ముఖ్య మంత్రి అవుతారని ఈ రాష్ట్రంలో మీరంతో మీకంతే మేమెంతో మాకంత అనే విధంగా ప్రతి కులానికి రిజర్వేషన్ స్థానంలో ఇప్పటివరకు రాజకీయంగా గాని ఇతరత్రా ఏ విధమైన గుర్తింపు లేని కులాలకు అవకాశాలు కల్పించవచ్చు అన్నారు. ఈ దేశంలో ఒక్క రాష్ట్రంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకునే నిర్ణయాలను బట్టి ఒక్కొక్క విధంగా రిజర్వేషన్లు అమలవుతున్నాయి అని మనం కూడా రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం తెచ్చుకొని వారికి అదేవిధంగా అవకాశాలను గుర్తించి అమలు చేయవచ్చు అని అన్నారు. అందువలన ఈ యొక్క సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఈ సంవత్సరం మార్చి ఆఖరుకల్లా 10 లక్షల మంది నుంచి సంతకాలు సేకరించి పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్ ) తీసుకునే నిర్ణయాలను ప్రజానీకం గౌరవిస్తుందని ఇప్పుడున్న రాజకీయ నాయకులు అందరికీ తెలిసేలా ప్రణాళిక ప్రకారం మన కార్యాచరణ ఉండాలి అని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతున్న విధంగా రాజకీయ నాయకులు రహదారుల వెంట మీటింగులు పెట్టి లక్షల మందిని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అత్తడుగు వర్గాలను తరలించి అనేక చోట్ల బహుజనుల మృతికి కారణం అవుతున్నారని రాజ్యాధికార సమితి అలాంటి వాటన్నిటినీ ఖండిస్తుందని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అలాంటివి జరగకుండా కార్యాచరణ ఉంటుందన్నారు. కరోనా పరిస్థితుల కారణంగా కొన్ని రోజులపాటు వాయిదా పడిన రథయాత్ర కార్యక్రమ విషయమై రథయాత్ర కమిటీ సభ్యులు విచ్చేసిన నాయకులకు వివరించారు.











**పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి సలహా సంఘం నేషనల్ ప్రెసిడెంట్ తట్టి అర్జునరావు మాట్లాడుతూ.....**

డాక్టర్ శివ భాగ్యరావు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి విషయంలో అన్ని కోణాలలో ఆలోచించి కూలంకషంగా చర్చించి తీసుకునే నిర్ణయాల వల్ల పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఇప్పటికే రాష్ట్రంలోనే కాక దేశంలోని అనేక వర్గాల ప్రజలకు అనేకమంది నాయకుల దృష్టికి వెళ్లిందని అలా వెళ్ళింది అంటే పార్స్ నియమ నిబంధనలు అదేవిధంగా ప్రజా రంజకంగా ఆకర్షణీయంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రణాళిక లేని విజిటింగ్ కార్డు పార్టీలు, సంఘాలు చాలా ఉన్నాయని, ఇప్పటివరకు ఉన్న పార్టీలు, కుల సంఘాలు గాని మాకు ఇంత ఓటు బ్యాంకు ఉంది అంత ఓటు బ్యాంకు ఉంది అని మేకపోతు గాంభీర్యపు వైఖరితో మాట్లాడుతున్నారే తప్ప ఎవరిలోనూ స్పష్టత లేదని,ఆ పార్టీలలా, సంఘాలలా కాకుండా ఒక ప్రణాళిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎలా పాలించాలి అనే విషయాలు అన్నీ పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ప్రణాళిక లో ఉన్నాయని, గతంలో అనేక సంఘాలతో తాము చర్చించినా తనకు తానే పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి కి ఆకర్షితుడనయ్యానని నాయకత్వం నిర్ణయించిన సలహా సంఘం చైర్మన్ గా తన ఆలోచనలను పార్స్ తో కలిసి బహుజన రాజ్యాధికారం సాధించే దిశగా నిర్ణయం తీసుకుంటామని అన్నారు. పార్స్ సభ్యులు నాయకులు వేరే వేరే ఓటు బ్యాంకు గురించి ఆలోచించకుండా ఓటు బ్యాంకు లేదనే భయాన్ని విడనాడాలి అని ప్రణాళిక ప్రకారం వెళితే ఓటు బ్యాంకు దానంతట అదే వస్తుంది అని తద్వారా అనుకున్న విజయాలు సాధించవచ్చు అని పార్సులో ఉన్న నాయకులు ఐకమత్యం తో రాజ్యాధికారం దిశగా పయనించాలి అని విజయమో వీర స్వర్గము మనమే నిర్ణయించుకోవాలి అని ఈ సందర్భంగా తట్టి అర్జున్ రావు అన్నారు.

**అనంతరం మాట్లాడిన స్టేట్ కోఆర్డినేటర్ ఏ బలరాం**

బీసీ కులాలలో అగ్రభాగాన ఉన్న నాలుగైదు కులాలు మాత్రమే ఇప్పటివరకు రాజ్యాధికారంలో పాలుపంచుకుంటున్నాయని అలా కాకుండా బిసిలలో ఉన్న ప్రతి కులానికి ప్రాతినిధ్యం ఉండేలా పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి ద్వారా రాజ్యాధికారం వచ్చిన తర్వాత ప్రతి కులానికి ప్రాతినిధ్యం ఉండేలా పార్స్ చూస్తుందని బలరాం అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఉన్న చిన్న చిన్న నాయకులను గుర్తించి వారి ద్వారా సంతకాల సేకరణ జరిపిస్తే అతి తక్కువ కాలంలో అనుకున్న విధంగా విజయాలు సాధించవచ్చని మరి ముఖ్యంగా పార్స్ ఆశయాలను ప్రతి ఒక్క బహుజనులకు అర్థమయ్యేల వివరిస్తే సంతకాల సేకరణ సులువుగా చేయవచ్చు అని ఇబ్బందులు రాకపోవచ్చు అని మరో స్టేట్ కోఆర్డినేటర్ కె రవికుమార్ అభిప్రాయం వెలిబుచ్చారు. సంతకాల సేకరణ విషయంలో వారి పరిధిలో ఉన్న ప్రాంతాలే కాక రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కూడా సంతకాల సేకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి అని ఆ విధంగా సంతకాల సేకరణను విజయవంతం చేస్తే శివ భాగ్య రావు ఆలోచన విధానాన్ని గౌరవించినట్లు అవుతుంది అని మరో స్టేట్ కోఆర్డినేటర్ ఎం పిచ్చయ్య అన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలో నాయకులని కలుపుకొని ఇంకా నియమించాల్సిన నాయకులను కూడా నియమించి నరసాపురం నియోజకవర్గ పరిధిలో అతి తక్కువ కాలంలోనే లక్ష సంతకాలు సేకరిస్తామని స్టేట్ కోఆర్డినేటర్ డి కె వి ప్రకాష్ అన్నారు. మనకు తెలిసిన బహుజన సంఘాల సభలలో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు పార్స్ నియమాలను వివరించగలిగితే సభ్యుల ద్వారా సంతకాల సేకరణ సులభతరం అవుతుంది అని పార్స్ స్పోక్స్ పర్సన్ కె ప్రసాదరావు అన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాధికార సమితి పాదయాత్ర కార్యక్రమం అతి త్వరలో ప్రారంభించి మార్గమధ్యలో నాయకులను కలుపుకొని పార్స్ నియమ నిబంధనలను ఆ ప్రదేశాలలో ఉన్న ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాన్ని రాష్ట్ర మొత్తం విస్తరించేలా ప్రణాళిక ఏర్పాటు చేస్తున్నామని స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ పి పరమశివన్ అన్నారు. విచ్చేసిన ప్రతి సభ్యులు పార్స్ నియమ నిబంధనలకు లోబడి కార్యక్రమాలు రూపకల్పన చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ బహుజన నాయకుడి సూచనలను పార్స్ గౌరవిస్తుందని, అమలు పరుస్తుందని తెలిపారు.

## కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధం



న్యూఢిల్లీ, జనవరి 30,: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంత్రివర్గం విస్తరణ, పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమైంది. ఈ నెల31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. ఈ లోగానే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఢిల్లీ రాజకీయ వర్గాల భోగట్టా. ఆ మేరకు రేపో మాపో మోడీ తన మంత్రి వర్గాన్ని పునర్వ్యవస్థీకరించే అవకాశాలున్నాయి. 2023 ఒక విధంగా ఎన్నికల నామ సంవత్సరం. ఈ ఏడాది తెలంగాణ సహా 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.సో .. ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలతో పాటుగా వచ్చే ఏడాది ( 2024)లో జరిగే సార్వత్రిక ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకుని కేంద్ర మంత్రి వర్గంలో మార్పులు చేర్పులు చేసేందుకు మోడీ నిర్ణయించారనీ, ఇందు కోసం భారీ కసరత్తు కూడా చేశారని అంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో రెండోసారి కొలువుదీరిన ఎన్డీయే మూడున్నరేళ్ల పాలన పూర్తి చేసుకుంది. సాధారణ ఎన్నికలకు దాదాపు ఏడాది పైగా గడువు ఉంది. ఈ నేపథ్యంలో, అన్ని కోణాల్లో పరిస్థితిని సమీక్షించుకుని, మరింత మెరుగైన పాలనకు వీలుగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు రెడీ అయ్యారని అంటున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రెండోసారి ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఏడాది మే 31న తొలి మంత్రివర్గం ఏర్పడింది. 2021 జులై ఏడో తేదీన మోడీ తన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేశారు. ప్రస్తుతం ప్రధానమంత్రితో కలిపి 31 మంది కేబినెట్ మంత్రులు, ఇద్దరు స్వతంత్ర హోదా మంత్రులు, 45 మంది సహాయ మంత్రులు మొత్తం 78 మంది ఉన్నారు. కేంద్రంలో గరిష్ఠంగా 83 మంది వరకు మంత్రులుగా ఉండే అవకాశం ఉంది. అంటే మరో ఐదుగురిని కేబినెట్ లో చేర్చుకునే అవకాశం ఉంది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇదే చివరి మంత్రివర్గ విస్తరణగా భావిస్తున్నారు. కేవలం అవకాశం ఉన్న ఐదుగురికి స్థానం కల్పించడమే కాకుండా పని తీరు ఆధారంగా కొందరికి ఉద్వాసన పలికి.. మరి కొందరు కొత్త వారికి అవకాశం ఇవ్వాలని మోడీ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక పోతే ఈ ఏడాది జగరనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ.. ఎలాగైనా తెలంగాణలో విజయం సాధించి అధికారం చేజిక్కించుకోవాలన్న పట్టుదలతో ఉంది. అందుకే మోడీ కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అనగానే తెలంగాణకు బెర్త్ ఖాయం అంటూ ఊహాగానాలు చెలరేగాయి.అలాగే గత మూడున్నరేళ్లుగా కేబినెట్ లో అసలు ప్రాతినిధ్యమే లేని ఏపీకి కూడా ఈ సారి బెర్త్ కన్ఫర్మ్ అంటూ వార్తలు వినవచ్చాయి. అయితే మోడీ కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో తెలుగు రాష్ట్రాలకు రిక్తహస్తమేనని ఢిల్లీలోని బీజేపీ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు తెలుస్తోంది. తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఆ తరువాత జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని విధాలుగా ఆలోచించి.. మోడీ మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరనించనున్నారని ఆ వర్గాలు చెబుతున్నాయి.

## బీఆర్ఎస్ జెండాలో తెలంగాణ మాయం

హైదరాబాద్, జనవరి 30, :తానే మారెనో, తలపే మారెనో.. తెలంగాణ ఊసే మరిచెనో అన్నట్లుగా తయారైంది తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరు. తెలంగాణ రాష్ట్ర సమితి.. తెలంగాణ సాధన కోసం ఏర్పాటైన ఉద్యమ పార్టీ.. ఆ తరువాత ఫక్తు రాజకీయ పార్టీగా ప్రకటించిన ఆ పార్టీ నేత పార్టీలో ఉద్యమ స్ఫూర్తికి చరమ గీతం పాడేశారు. ఆ తరువాత టీఆర్ఎస్ ను జాతీయ పార్టీగా మార్చి.. తెలంగాణ పదాన్ని తొలగించారు. దానితో పాటే తెలంగాణ ఆత్మకూ తిలోదకాలిచ్చేశారు.ఇక ఇప్పుడు విస్తరణలో భాగంగా తెలుగు భాషకూ చెల్లు చీటీ పాడేశారు. నిజమే బీఆర్ఎస్ ఇప్పుడు జాతీయ పార్టీ.. ప్రాంతం, భాష తారతమ్యాలు లేకుండా అన్ని ప్రాంతాలకూ, భాషలకూ సమ ప్రాధాన్యత ఇవ్వాలి. అంత వరకూ అయితే అభ్యంతరం లేదు. అందుకు తగినట్లుగానే బీఆర్ఎస్ లో ఇతర రాష్ట్రాల వారు ఎవరన్నా చేరితే ఆ రాష్ట్ర భాషలో కండువాలు తయారు చేయించి కప్పుతున్నారు. అంత వనరై ఓకే. కానీ తెలంగాణ రాజధానికి వచ్చి బీఆర్ఎస్ లో చేరే వారిని పార్టీలోకి ఆహ్వానించే సందర్భంలో కూడా తెలుగుకు, తెలంగాణకు ఇసుమంతైనా ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని బీఆర్ఎస్ శ్రేణులే జీర్ణించుకోలేకపోతున్నాయి.ఇటీవల ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్, ఆయన తనయుడు ప్రగతి భవన్ లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ గూటికి చేరారు. కేసీఆర్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అయితే ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలలో ఎక్కడా తెలంగాణ కనిపించలేదు. తెలుగు భాష కనిపించలేదు. భారత దేశం మ్యాప్, హిందీ, ఇంగ్లీషు, ఒరియాలలో బ్యానర్లు మాత్రమే దర్శనమిచ్చాయి. తెలంగాణ భవన్ లో జరిగే బీఆర్ఎస్ కార్యక్రమాలలో సైతం పార్టీ బ్యానర్లు కేవలం హిందీ, ఇంగ్లీషు భాషలోనే దర్శనమిస్తున్నాయి. ఇక ఇతర రాష్ట్రాల వారి చేరికల సందర్భంగా ఏర్పాటు చేసే బ్యానర్లలో ఆయా రాష్ట్రాల భాషలో మాత్రమే బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో ప్రజలను ఏ భాషలో ఓట్లు అడగాలని బీఆర్ఎస్ నాయకులు మధన పడుతున్నారు. రాష్ట్ర సమస్యలు, రాష్ట్ర ప్రయోజనాల గురించి ఇటీవలి కాలంలో కేసీఆర్ అసలు ప్రస్తావించడం లేదనీ, ఎంత సేపూ కేంద్రంపై విమర్శలు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారితో భేటీలు, సమావేశాలూ, చర్చలకే పరిమితమౌతున్నారనీ, దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు పార్టీ దూరం అవుతోందని పార్టీ శ్రేణులే ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రెండు సార్లు పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువచ్చిన తెలంగాణను విస్మరించడమంటే మూలాలను వదిలేయడమేనని అంటున్నారు. బీఆర్ఎస్ విస్తరణ సంగతి అలా ఉంచి ఇదే తీరు కొనసాగితే.. తెలంగాణలో బీఆర్ఎస్ పరిస్థితి ఏమౌతుందో కేసీఆర్ ఆలోచించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన కొత్త కురుమ మంగమ్మ శివకుమార్



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిధి:కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర నేటితో దిగ్విజయంగా పూర్తయి సందర్భంగా తుర్కయాంజల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు తదుపరి 21వ వార్డు పరిధిలో గల శ్రీరాం నగర్ కాలనీ లోని రాముల వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో టి.పి.సి.సి కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కౌశిక ఐలయ్య, నాయకులు కుంట గోపాల్ రెడ్డి,కాకుమాను చెన్నయ్య, భాస్కర్ రావు,గుడ్ల అర్జున్,గుండ నర్సింహ,ఎరుకలి రవి,వస్పరి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డిని సన్మానించిన డివిజన్ ప్రజలు



మేడిపల్లి, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ గా దొంతిరి హరిశంకర్ రెడ్డి ఎన్నికై 3 సంవత్సరాలు పూర్తి అయిన శుభ సందర్భంగా డివిజన్లోని శ్రీ సాయి నగర్ కాలనీ వాసులు కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి కాలనీ అధ్యక్షులు,కార్యదర్శులు, అసోసియేషన్ సభ్యులు,మహిళలు,పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి: కార్పొరేటర్ సుభాష్ నాయక్



మేడిపల్లి, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్2వ డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సుభాష్ నాయక్ పేర్కొన్నారు. కార్పొరేటర్ గా ఎన్నికై 3 సంవత్సరాలు పూర్తి అయిన శుభ సందర్భంగా డివిజన్ ప్రజలు కార్పొరేటర్ డాక్టర్ సుభాష్ నాయక్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల బాలరాజు, ప్రధాన కార్యదర్శి వరికల శ్రీనివాస్ మరియు సీనియర్ నాయకులు బండారి మల్లేష్, ధరణి కాలనీ అధ్యక్షులు పురుషోత్తం జనరల్ సెక్రటరీ లింగం, డాక్టర్ శ్రీనివాస్, తండా శ్రీనివాస్, ప్రకాష్ అన్న, సుకుమార్ రాజు రాథోడ్, ఉపేందర్ మరియు ధరణి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ శ్రీలతను సన్మానించిన కూచిపూడి వెంకటేశ్వరరావు..



తల్లాడ, జనవరి 30 (ప్రజా పాలన న్యూస్): లిఉత్తమ తహశీల్దార్ ఎంపికై జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ చేతులమీదుగా అవార్డు అందుకున్న తల్లాడ తహశీల్దార్ గంటా శ్రీలతను తెదేపా మండల అధ్యక్షులు కూచిపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరికొండ శ్రీనివాసరాజు, కొమ్మినేని నరసింహారావు, అయినాల నరసింహారావు, టెంటు సురేష్, దగ్గుల శ్రీనివాసరెడ్డి, మొక్క కృష్ణార్జున్ తదితరులు ఉన్నారు.

# బోనకల్ ఆత్మీయ సమ్మేళనంలో నేనున్నానంటూ భరోసా ఇచ్చిన పొంగులేటి



మధిర రూరల్ జనవరి 30 ప్రజా పాలన ప్రతినిధి నియోజకవర్గ పరిధిలో బోనకల్లో ఆత్మీయ సమ్మేళనం సమావేశం లో భాగంగా ఐదు మండలాల పరిధిలో పొంగులేటి అభిమానులు బి ఆర్ఎస్ నాయకులు ఎర్రుపాలెం మండలం జడ్పిటిసి శీలం కవిత ఐలూరి వెంకటేష్ రెడ్డి లక్ష్మారెడ్డి చిదురాలవెంకటేశ్వరావు కోటా రాంబాబు ఎర్రగుంట రమేష్ గూడూరు రమణా రెడ్డి జడ్పిటీసీలు ఎంపీటీసీలు భారీ ఎత్తున పొంగులేటి అభిమానులతో వారి ఆధ్వర్యంలో జన సమీకరణలో భాగంగా ఆత్మ సమ్మేళనం భారీగా తరలివచ్చి పొంగిలేటికి స్వాగతం పలికి అనంతరం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పొంగులేటి ఒంటరి వాడు కాదు.ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టిన వేలాదిమందిగా ఆత్మీయ సమావేశానికి తరలివచ్చారు. తాను ఎవరో తెలియనప్పుడే జిల్లా ప్రజలను తనకు గుర్తించారుతనకు ఇచ్చిన వాగ్దానాలను నేరావేర్చడంలో సీఎం కేసీఆర్, కేటీఆర్ విఫలం అయ్యారుఅసెంబ్లీ ఎన్నికలలో తాను బీఆర్ఎస్ అభ్యర్థుల ఓటమికి కారణమని ఎంపి సీటు ఇవ్వలేదుఏడున్నర సంవత్సరాలు బీఆర్ఎస్ నాయకులు అనేక రకాలుగా నన్ను, నావెంట ఉన్న వారిని ఇబ్బందులు పెట్టారు.మధిర మున్సిపాలిటీ నేను వేసిన భిక్ష కాదా అని ప్రశ్నించారురాష్ట్ర వ్యాప్తంగా ఆర్థికంగా బీఆర్ఎస్ కు వెన్నుదన్నుగా నిలిచా.నన్ను నమ్ముకున్న ప్రతి ఒక్కరిని ఇబ్బందులు పెట్టారుతాను నియోజకవర్గాలలో పర్యాటించాలంటే పాస్ పోర్టు తీసుకుని రావాలని చెప్పి అవమానించారు. తనకు జరిగి అవమానాన్ని చెప్పుకునే అవకాశం సీఎం కేసీఆర్ కల్పించలేదు.ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ విఫలం అయ్యారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి పేద వాడికి ఇందిరమ్మ ఇళ్లలు కట్టించాడు.రుణమాఫీ చేయలేదు. రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వడం లేదు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదు. ప్రజలు కోరుకున్న తెలంగాణను ఇచ్చామా లేదా అని ఆలోచించాలి వారు తెలిపారు అదే విధంగా నామీద అభిమానంతఈ ఆత్మీయ సమ్మేళనం సమావేశానికి వచ్చి నాపై అభిమానం చూపినందుకు మీ అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ నేనెప్పుడూ పుట్టినంతకాలం మీ రుణం తో రాజకీయంగా ఉంటూమధిర నియోజవర్గగ ప్రజలు ఏ అవసరం వచ్చినా మీ అండగామీ శీనన్న ఉంటాడని వారు తెలిపారు అదేవిధంగా పలుమండలాల నుంచి పొంగులేటి ఆత్మీయుల సమావేశ సభక్కు పెద్ద ఎత్తు జన సమీకరణాన్ని తీసుకొచ్చిన అన్నిని వర్గాల ప్రజలకు రెడ్డి సామాజిక వర్గంలు ఆత్మీయ సమావేశాన్ని వచ్చిన వారికి పొంగులేటి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాస్ అభిమానుల్ను సర్పంచులు ఎంపీటీసీలు కౌన్సిలర్లు నాయకులుకోట రాంబాబు వెంకటేశ్వర్లు యన్నం కోటేశ్వరావు లక్ష్మారెడ్డి గడూరు రమణారెడ్డి ఎర్రుపాలెం జడ్పిటిస కవిత ఐలూరువెంకటేష్ రెడ్డి ఎర్రగుంట లక్ష్మి రమేష్ పలు మండలాల్లో సర్పంచులు జెడ్పిటిసి ఎంపిటీసీలు పాల్గొన్నారు

## మధిర శివాలయంలో వచ్చే మురికి వాడను డ్రైనేజ్ నుంచి దుర్వాసన బాగు చేయండి: తెలుగుదేశం పార్టీ



మధిర జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో రెండో కాశీగాదక్షిణ కాశీగా పేరొందిన వందల సంత్సరాల చరిత్ర కలిగిన వైరా నది ఒడ్డున గల శ్రీ మృత్యుంజయ స్వామి దేవాలయం వద్ద మధిర పట్టణం నుండి వచ్చు మరుగు నీటిని హిందూ స్మశాన వాటిక నుండి డ్రైనేజ్ తీసుకొచ్చి దేవాలయం ముందు వదిలి భక్తులకు అసౌకర్యం కల్పించిన మున్సిపల్ పాలకులు, ఈ డ్రైనేజ్ నుండి వచ్చుదుర్గంధము భక్తులకు చాలా ఇబ్బందిగా ఉన్నదని అనేక పర్యాయములు రాష్ట్ర లిటిడిపి నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథంలి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ కి మరియు కమిషనర్ కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. వారు మహాశివరాత్రి నాటికి అక్కడ డ్రైనేజ్ మీద కల్వర్టు కట్టి పరిసరాలు అంతా శుభ్రంగా ఉంచుతామని హామీ ఇచ్చినారు కానీ ఈనాటి వరకే ఆ వాగ్దానం అమలుకావలేదు, కాగా భక్తులు ఇచ్చిన చందాల తో దేవస్థానం కమిటీ వారు తాత్కాలిక మరమ్మతులు చేయటం జరిగింది. ఈరోజు సదరు ప్రదేశమునందు పరిశీలనకు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉన్నది అన్న సంధాన, ఉన్నది అని రామనాథం మాట్లాడుతూ ఇప్పటికైనా పాలకులు త్వరితగట్టిన శివరాత్రి నాటికి పనులు పూర్తి చేయవలసిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లాది హనుమంతరావు, 14వ వార్డు కౌన్సిలర్ వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, మక్కెన నాగేశ్వరరావు, కొంకా రమేష్, మాగం ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీజీ వర్ధంతి వేడుకలు



మధిర జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోరాహుల్ గాంధీ జోఢోయాత్రకు సంఘీభావంగా జాతీయ జెండాను ఎగరవేసిన సూరంశెట్టి కిషోర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ శాసనసభ్యులు, శాసనసభాపక్ష నేత లిమల్లు భట్టి విక్రమార్కలి సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ లిమల్లు నందిని విక్రమార్కహాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.భారత్ జూడో యాత్ర ముగింపు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసూరం శెట్టి కిషోర్లి జాతీయ జెండాని ఎగురవేసి లిరాహుల్ గాంధీలిపాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు.. ఈ సందర్భంగా మల్లు నందిని విక్రమార్క మాట్లాడుతూజాతిపిత మహాత్మా గాంధీ. అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడుఅహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన గాంధీ మార్గంలోనే నేడు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు దాదాపు 145 రోజుల పాటు . అన్ని రాష్ట్రాలను కలుపుకుంటూ సాగిన జోడో యాత్రలో రాహుల్ గాంధీ 4 వేలకు పైగా కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. భారత్ జోడోయాత్రలో రాహుల్ గాంధీ వివిధ వర్గాల ప్రజలతో మమేకమయ్యారు. వారితో సమావేశాలు నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమిళనాడులోని కన్యాకుమారిలో గత ఏడాది ప్రారంభమయిన రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర శ్రీనగర్లో నేటితో ముగియనుంది. ఈ సందర్భంగా గ్రామ గ్రామాల్లో రాహుల్ గాంధీ సందేశం ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉన్నది హాత్సే హాత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి రాహుల్ గాంధీ గారి సందేశాన్ని వినిపించాలి అన్నారుఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు లిచావా వేణులి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు లిమిరియాల వెంకటరమణ గుప్తాలి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లిధారా బాలరాజులి సర్పంచ్ లిపులి బండ్ల చిట్టిబాబులి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లితూమాటి నవీన్ రెడ్డిలి కాంగ్రెస్ సీనియర్ నాయకులు లిపారుపల్లి విజయకుమార్, కర్నాటి రామారావు, నిడమనూరి వంశీకృష్ణ, ఆవుల కిరణ్లి మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు లిదుంప వెంకటేశ్వర రెడ్డిలి మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు లిబానోత్ వెంకటరమణ నాయక్లి సేవాదళ్ అధ్యక్షుడు లిఆదూరి శీనులి మైనార్టీ అధ్యక్షుడు లిషేక్ ఫయాజ్లి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు లిషేక్ జహంగీర్లి పట్టణ ఐఎన్టియుసి అధ్యక్షుడు లిషేక్ బాజీలి కాంగ్రెస్ నాయకులు లిమాగం ప్రసాద్, రామారావు, బండారి నరసింహారావు, బుల్లెద్దు రాజేంద్ర, కోట నాగరాజు, కోట డేవిడ్, ఆదిమూలం శ్రీనివాసరావు, మైలవరపు చక్రి, సంపసాల రామకృష్ణ, ఉట్ల రాంబాబు నూరు మొహమ్మద్, ఎండి రహీం, మైలవరం లక్ష్మీ స్వాతి, పూర్ణ కంటి రాణిలి మొదలగు వారు పాల్గొన్నారు

## మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో ఇతర పార్టీ కార్యకర్తలు బి ఆర్ ఎస్ పార్టీ లోకి భారీగా చేరికలు





ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య చిత్తాపూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు నాగరాజు గౌడ్ సమక్షంలో ఈ కార్యక్రమంలోఅలాగే గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల పెద్దిరాజు గ్రామ ప్రధాన కార్యదర్శి ఏర్పుల శీను మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల కృష్ణ మరియు చిత్తపూర్ గ్రామ ఉపసర్పంచ్ ఉబ్బల రేణుక రవి టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లామోని మల్లయ్య, పాల్గొనడం జరిగింది ఇబ్రహీంపట్నం ముద్దుబిడ్డ బంటి అన్న మంచికి మారుపేరు మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు .ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలకు రావడం జరిగింది సడివల యాదగిరి , పోలే జశ్వంత్ రెడ్డి, సిల్వర్ భాను, పాలాది నవీన్, ఏర్కొండ అనిల్, ఏరుకొండ దిలీప్, పిట్టల భరత్, చెరుకు నితిన్, పాలాది వినయ్, శివ పార్టీలో కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్, ప్రధాన కార్యదర్శి కాట్రద్ బహుదూర్, తాళ్ల పెల్లి కూడా ఎంపిటిసి సుకన్య శేఖర్ రెడ్డి, అలాగే బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లె జంగారెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు వనపర్తి బద్రీనాథ్ గుప్తా, చిత్తాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉబ్బల శీను, టిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఏర్పుల అశోక్ ,బిఆర్ఎస్వి అధ్యక్షుడు ఏర్పుర ప్రసాద్ కుమార్ టిఆర్ఎస్ పార్టీ తదితరులు పాల్గొన్నారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

మంగళవారం 31, జనవరి 2023

# కులగణన.. బీజేపీకి భయమెందుకు?

బీజేపీ ప్రవచించే 'సమ్మిళిత హిందుత్వ' విధానం కారణంగా ఆ పార్టీకి బీసీల మద్దతు లభించింది. ఫలితంగా బీజేపీ లాభపడింది. కానీ, బీసీలకు ఎటువంటి ప్రయోజనం కలుగలేదు. కుల ప్రాతిపదికన జనగణన జరిపితే ఈ విషయం రుజువవుతుంది. అంతేకాదు, బీజేపీ రాజకీయాలకు కూడా అడ్డుకట్టే పడే అవకాశాలు పెరుగుతాయి. అందుకే, బీసీల డిమాండ్ అయిన కులగణనకు కేంద్రంలోని బీజేపీ సమ్మతించటం లేదు.అధికార కేంద్రాల్లోకి, సంస్థల్లోకి దళితులు, బహుజనులు, ఆదివాసీలను తీసుకురావటం వల్ల భారత్ మరింత ప్రజాస్వామ్యీకరింపబడుతుంది, మరింత సుసంపన్నమవుతుందనే భావనకు భవిష్యత్తులో మద్దతు పెరగటం ఖాయం.కులగణన వల్ల వివిధ రంగాల్లో బీసీల సంఖ్యకు తగిన ప్రాతినిధ్యం లేదని స్పష్టమవుతుంది. ఈ గుర్తింపు వల్ల సామాజిక న్యాయం కోసం ఈ వర్గాలలో ఒక కొత్త రాజకీయ చైతన్యం మొగ్గతొడిగి, సామాజిక ఉద్యమానికి నాంది పలికే అవకాశం ఉంది. ఈ పరిస్థితే వస్తే బీజేపీ రాజకీయాలు ప్రభావం కోల్పోతాయి. కాబట్టే, బీసీ జనగణన జరుపటానికి బీజేపీ నిరాకరిస్తున్నది.దేశ ప్రజానీకంలో సామాజికంగా, ఆర్థికంగా వచ్చే మార్పులను అర్థం చేసుకోవటానికి జనాభా లెక్కలు, భారీ సామాజిక సర్వేలు ప్రభుత్వానికి ఉపయోగపడుతాయి. ఆ సర్వేల ద్వారా ఎంతో విలువైన సమాచారం అందుబాటులోకి వస్తుంది. సాధారణంగా వలస ప్రజలు, విద్యావంతులు, వృత్తి సముదాయాలు మొదలైన విభాగాలపై వివిధ సంస్థలు ఇంటింటి సర్వేలను చేపడుతుంటాయి. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు ఈ వర్గాలపై ఏ విధమైన ప్రభావం చూపాయనేది తెలుసుకోవడానికి ఈ సర్వేలను జరుపుతాయి. అయితే, విచిత్రమైన విషయం ఏమంటే, మన దేశంలో కులం అనేది సామాజికంగా ఒక ప్రముఖ అంశమైనప్పటికీ దాని ఆధారంగా సమాచారం సేకరించటానికి ప్రభుత్వం సంకోచిస్తుంటుంది. ముఖ్యంగా బీసీల విషయంలో ఇది మరింత స్పష్టంగా కనిపిస్తుంది. జాతీయస్థాయిలో కులగణన చేపట్టడానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. ఈ వివరాలు సేకరిస్తే కుల ప్రాతిపదికన సామాజిక, ఆర్థిక భావోద్వేగాలు తీవ్రమవుతాయని, తద్వారా తమ 'హిందు త్వ-జాతీయవాద రాజకీయాలకు' ఆటంకం ఏర్పడుతుందనే భయమే ఇందుకు కారణం.భారత ప్రజాస్వామ్యంలో కులం ప్రాథమిక అంశం. 1947 తర్వాత రాజ్యాంగ రచన సాగుతున్నప్పుడు, అప్పటికే సామాజిక, రాజకీయ రంగాలలో కులవ్యవస్థ విష ప్రభావాన్ని చూసిన మన జాతినిర్మాతలు, ఈ కులవ్యవస్థను రూపుమాపి భారత పౌరులకు ఆధునిక జాతీయవాద అస్తిత్వాన్ని నిర్మించాలని భావించారు. కానీ రాజ్యాంగం అమల్లోకి వచ్చి 73 ఏండ్లయిన తర్వాత కూడా, ఉన్నతవర్గాల కుల అస్తిత్వంలో ముడిపడిన అధికారాలను, ప్రయోజనాలను ప్రజాస్వామీకరించడంలో దేశం విఫలమైంది. సంప్రదాయ సామాజిక కులీన వర్గాలు రాజకీయాధికారం కొనసాగిస్తూ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలను ఇప్పటికీ నియంత్రిస్తున్నాయి. అట్టడుగువర్గాలు అధికార ప్రాంగణాలకు దూరంగా ఉండి, ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను స్వీకరిస్తూ బతుకీడుస్తున్నాయి.ఓబీసీలు అంటే- కులవ్యవస్థలో అట్టడుగు న ఉండే శూద్రులు. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థతో ముడిపడినవారు, వృత్తి కార్మికులు, చేతివృత్తుల కళాకారులు, ఇతర కష్టజీవులు. వీరిని తరచుగా బహుజనులని సంబోధిస్తుంటారు. 1931 జనగణనలో ఓబీసీ జనాభా వివరాల ను ప్రచురించారు. అప్పుడు వీరి జనాభా 52 శాతం. ఆ తర్వాత నుంచి ఏ ప్రభుత్వమూ ఓబీసీల లెక్కలు తీయలేదు. దళితులు, ఆదివాసీల లెక్కలు తీస్తారు కనుక, వివిధ ప్రాంతాల్లో, ప్రభుత్వ సంస్థల్లో, విద్యారంగం లో వారు ఎంత ఉన్నారనేది వెల్లడవుతున్నది. కానీ ఓబీసీలకు సంబంధించి జాతీయస్థాయి లో డేటా లేదు. 1970లలో ఆధిపత్య వ్యవసాయ కులాలకు చెందిన నాయకులు రాజకీయాధికారం చేపట్టడం మొదలైంది. సోషలిజం, సామాజిక న్యాయం అనే నినాదాలు విశాల ప్రజానీకాన్ని ముఖ్యంగా నిమ్న కులాలను, దళితులను ఆకర్షించాయి. ముఖ్యంగా ఉత్తరాది న ఈ పరిణామం చోటుచేసుకున్నది లాలూప్రసాద్ యాదవ్, దేవీలాల్, ములాయం సింగ్ యాదవ్, రాంవిలాస్ పాశ్వాన్, శరద్‌పవార్ వంటి ప్రాంతీయ, ఓబీసీ, దళిత నాయకులు ఆవిర్భవించారు. ఫలితంగా జాతీయస్థాయిలో కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యానికి భంగం వాటిల్లింది. సామాజిక న్యాయం నినాదం కేంద్రంగా మొదలైన ఈ రాజకీయాలు దేశ ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠపరిచాయి. అప్పటివరకూ అణచివేతకు గురైన ప్రజానీకానికి సాధికారత కల్పించాయి. మరీ ముఖ్యంగా, ఉత్తరాది రాష్ట్రాల్లో మితవాద రాజకీయాలను (హిందుత్వ రాజకీయాలను) అవి అడ్డుకోగలిగాయి. 1951లో జనసంఘ్ ప్రారంభించిన, ఆ తర్వా తి దశలో బీజేపీ కొనసాగించిన ఈ రాజకీయా లు.. అగ్రకులాల, బూర్జువా వర్గ ప్రయోజనాలకు సంబంధించినవని సామాజిక న్యాయ సమర్థకులు తీవ్రంగా విమర్శించారు. రాజకీయాల్లో దళిత, బహుజనుల బలం పెరుగుతుండటాన్ని సహించలేకే హిందుత్వ రాజకీయాలను తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. అయితే, సామాజిక న్యాయ రాజకీయాలు ఎంతోకాలం నిలబడలేకపోయాయి. బీజేపీ మతతత్వ, జాతీయవాద రాజకీయాలు ఊపందుకున్నాయి. దిగువ కులాలను కలుపుకొని పోకపోతే ఎన్నికల రాజకీయాల్లో విజయం సాధించటం కష్టమని బీజేపీ కూడా కాలక్రమేణా గుర్తించింది. సామాజిక న్యాయ రాజకీయాలు కొన్ని కులాలకే లబ్ధి చేకూర్చాయనే ప్రచారం జరుపుతూ ఇతర ఓబీసీ కులాలను (ఉదాహరణకు యూపీలో, బీహార్‌లో యాదవేతర కులాలను) ఆకర్షించటానికి ప్రయత్నించింది. హిందుత్వ రాజకీయాల కింద నిమ్న కులాలకు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామ ని, వారి సాధికారతకు చర్యలు తీసుకుంటామ ని ప్రకటించింది. 2014 నుంచి అమల్లో పెట్టిన ఈ వ్యూహం ఫలించింది. వివిధ రాష్ట్రాల అసెంబ్లీల్లో, లోక్‌సభ ఎన్నికల్లో ముఖ్యంగా బీహార్, యూపీ, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆ పార్టీ ఓట్లు, సీట్లు పెరిగాయి. బీజేపీ రాజకీయాల కారణంగా ఓబీసీ వర్గాల మధ్య ఐక్యత తీవ్రంగా దెబ్బతిన్నది. దిగువ ఓబీసీ కులాలు ఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలను వదిలిపెట్టి బీజేపీ వెంట నడిచారు. ఈ విధంగా బీజేపీ ప్రయోజనం పొందినప్పటికీ, ఆయా ఓబీసీ వర్గాల పరిస్థితుల్లో పెద్దగా మార్పులు వచ్చింది లేదు. అధికారంలో, వ్యాపారంలో, పరిశ్రమల్లో, భూమి తదితర స్థిరాస్తుల్లో వారి ప్రాతినిధ్యం ఇప్పటికీ నామమాత్రమే. వీటన్నింటా అగ్రకులాల పెత్తనమే కొనసాగుతున్నది. కులగణన ద్వారా సామాజిక న్యాయ రాజకీయవేత్తలు ఓబీసీ రాజకీయాలను పునరుద్ధరించాలని భావిస్తున్నారు. ముఖ్యంగా బీహార్‌లో ఇది ప్రస్తుతం జరుగుతున్నది. ఆర్జేడీ, జేడీయూ పొత్తు ఫలితం గా శక్తిమంతమైన యాదవ, కుర్మి, ముస్లింల కూటమి మరింత బలోపేతమైంది. అయితే, ఇతర బీసీల నుంచి ముఖ్యంగా ఈబీసీల నుం చి మద్దతు సాధించటం ఈ కూటమికి కష్టమే. ఏదేమైనా, బీసీల సమస్యలను లేవనెత్తటం ద్వారా మరోమారు సామాజిక న్యాయ రాజకీయాలను ముందుకు తేవచ్చని, బీజేపీని గట్టిగా ఎదుర్కోవచ్చని వీరు భావిస్తున్నారు.కులగణన ద్వారా వివిధ రాష్ట్రాల్లో బీసీల సంఖ్య ఎంత ఉన్నదో తెలుస్తుంది.

# మందుల కంపెనీలు - నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ

గాంబియాలో 66 మంది పిల్లలకు మూత్రపిండాలు పాడై చనిపోయారు. దీనికి కారణం హర్యానా లోని 'మైడెన్ ఫార్మా' మందుల కంపెనీ తయారు చేసిన దగ్గు మందు. ఇందులోని డై ఇథలైన్ గ్లైకాల్, ఇథలిన్ గ్లైకాల్ అనే మందులు కలుషితం కావడంతో వీరు చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. ఈ విషయం సభ్య సమాజాన్ని కకావికలం చేసింది. హృదయ విదారకమైన ఈ సంఘటన ప్రపంచాన్ని కలచివేసింది. అదేగాక ఇండోనేషియాలో కూడా ఈ తరహా సంఘటన జరిగిందని వార్తలొచ్చాయి. మందులు కలుషితం కావడం, మోతాదుకు మించి ఉపయోగించడం, సరైన ప్రామాణికాలు పాటించకపోవడంతో ఈ ఘటనలు జరిగాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. ఈ దారుణాన్ని మర్చిపోకముందే ఉత్తరప్రదేశ్‌కు చెందిన మారియన్ బయోటిక్ ఫార్మా కంపెనీ తయారుచేసిన డాక్‌వన్ మ్యాక్స్ అనే కాఫ్ సిరప్ తాగడంతో గత డిసెంబరులో ఉజ్బెకిస్తాన్‌లో 18 మంది చనిపోయినట్లు వెలుగు లోకి వచ్చింది. దీంతో మందుల కంపెనీల ఎగుమతుల్లో భారత్ ప్రతిష్ట మసకబారేలా వుంది.



మన దేశంలోనూ అనేక ప్రాంతాల్లో ఈ తరహా సంఘటనలు చోటుచేసుకున్నాయి. కొద్ది సంవత్సరాల క్రితం విశాఖపట్నంలో మధుమేహ వ్యాధిగ్రస్తుడు రోజూ ఇన్సులిన్ తీసుకుంటున్నప్పటికీ, సుగర్ వ్యాధి నియంత్రణ లోకి రాలేదు. దాంతో వైద్యుడు అనుమానంతో ఇన్సులిన్ వైల్‌ను పరీక్షకు పంపించగా నిర్ఘాంతపోయే వాస్తవం బైటపడింది. వైల్‌లో ఇన్సులిన్ మందు బదులు డిస్టిల్ వాటర్ వున్నట్లు గుర్తించి దిగ్భ్రాంతి చెందారు. ఔషధ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. ఇటువంటి ఘటనలు అనేకం వున్నాయి. 1986లో దేశ ఆర్థిక రాజధాని ముంబయి లోని జెజె ఆస్పత్రిలో చోటుచేసుకున్న 14 మరణాలు దేశ ప్రజలను కలచివేశాయి. 10 నుంచి 76 ఏళ్ల వయసు కల్గిన ఈ 14 మంది మూత్రపిండాలు దెబ్బతిని చనిపోయారు. ప్రజలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో ఈ మరణాలపై ప్రభుత్వం కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. ఈ దుర్ఘటనపై ముంబాయి హైకోర్టు జడ్జి భక్తావర్ లెంటిన్‌తో స్వతంత కమిషన్‌కు ప్రభుత్వం ఆదేశించింది. వివిధ స్థాయి అధికారులు ఈ కంపెనీ అవకతవకల్లో భాగస్వాములైనట్లు కమిషన్ గుర్తించింది. డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించింది. మందుల షాపులు, ఔషధ కంపెనీల్లోని లోపాల్ని ఎత్తిచూపింది. ముంబయి జనాభా అవసరాలకు మించి మందుల షాపులున్నట్లు తేల్చింది. ఈ సంఘటనతో అన్ని పార్శ్వాలను లెంటిన్ అధ్యయనం చేసి మందుల తయారీ నుంచి అమ్మకాల వరకు నియంత్రణ, పర్యవేక్షణ లోపాలపై ప్రభుత్వానికి స్పష్టమైన నివేదిక ఇచ్చారు. ఈ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించారు.

మందుల్లో 35 శాతం వరకు నాసిరకం, నకిలీ మందులు చలామణిలో వున్నాయని...2004లో అప్పటి కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో ప్రకటించారు. నాసిరకం మందుల తయారీదారులు, అమ్మకందారులను బహిరంగంగా ఉరితీయాలని ఆవేశంగా మాట్లాడారు. కానీ నాసిరకం మందుల తయారీదారులపై మోడీ ప్రభుత్వం ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పర్యవేక్షణ పెంచలేదు. ప్రాణాలను కాపాడ్డానికి ఔషధాలను తయారుచేసే ఫార్మా కంపెనీలు అధిక లాభాల కోసం మనుషుల ప్రాణాలను తీయడానికి సైతం సిద్ధపడుతున్నాయని ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి. ఫార్మా ఉత్పత్తులు, ప్రోత్సాహకాలపై ప్రభుత్వాలు దృష్టి పెడుతున్నాయి తప్ప వాటిలో నాణ్యతను పరిశీలించడంలేదు. ఉత్పత్తి సంస్థలు చేస్తున్న తప్పిదాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధపడటంలేదు. ఔషధ నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేయడంలేదు. యాభై ఔషధ కంపెనీలకు, రెండొందల మందుల షాపులకు ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వుండాలన్న సిఫార్సులను అమలు చేయడంలేదు. నాణ్యత, ప్రమాణాలను పరీక్షించాల్సిన సిబ్బంది లేకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో మందులు విచ్చలవిడిగా మార్కెట్లోకి చేరుతున్నాయి.

గాంబియాలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో భారత్‌కు చెందిన 16 మందుల కంపెనీల దిగుమతులపై నేపాల్ ప్రభుత్వం గత డిసెంబరులో నిషేధం విధించింది. ఇందులో రామ్‌దేవ్ బాబాకు చెందిన దివ్య ఫార్మసీ, పతంజలి ఉత్పత్తులు కూడా వున్నాయి. భారత్ లోని ప్రముఖ మందుల ఉత్పత్తి కంపెనీలు కూడా నిషేధిత జాబితాలో వున్నాయి. అనేకసార్లు అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేసిన భారత్‌కు చెందిన ప్రఖ్యాత కంపెనీల మందులు తరచూ వెనక్కి వస్తున్నాయి. నేపాల్ ప్రభుత్వం నిషేధించిన మందులు భారత్ మార్కెట్‌లో వినియోగంలో వున్నాయంటే, ప్రభుత్వం మందుల కంపెనీల పట్ల ఎంత ఉదారంగా వ్యవహరిస్తున్నదీ అర్థమవుతుంది.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం భారత ఔషధ నియంత్రణ వ్యవస్థను పటిష్టపరచాలి. ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చట్టాలకు మరింత పదును పెట్టాలి. నాసిరకం మందులు తయారుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకొనేలా వ్యవస్థలను బలోపేతం చేయనంతకాలం ప్రజల ప్రాణాలకు రక్షణ వుండదు. ప్రయివేటు మందుల ఉత్పత్తిదారులను ప్రోత్సహించి, ప్రభుత్వ రంగం లోని ఔషధ కంపెనీలను మూసివేసిన దుష్ఫలితాలు ఇప్పుడు ఈ రూపాల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ప్రయివేటు ఔషధ కంపెనీల మోసాలకు ప్రభుత్వాలు ముకుతాడు వేసి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. 'లెంటిన్' సిఫారసులను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలుచేయాలి.

# 'ఫేక్' ఉత్తర్వులతో సోషల్ మీడియాపై కత్తి

ఓడ ఎక్కేవరకూ ఓడ మల్లయ్య అన్న పెద్దమనుషులు ఓడ దిగాక ఏమంటారో ఆ సామెత తెలిసిన తెలుగువాళ్లకు బాగా తెలుసు. ప్రధాని నరేంద్ర మోడి సర్కారు విధానం అచ్చంగా ఆ సామెతకు నకలుగా తయారైంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మూడు పర్యాయాలు ఎన్నికైన మోడీ ప్రధాని అభ్యర్థిగా ప్రచారంలోకి రావడానికి సోషల్ మీడియాను సోపానంగా వాడుకున్నారు. కార్పొరేట్ల సాయంతో వేలాది మంది యువతను నియోగించి అహోరాత్రులు ఆయన ఘనతను హోరెత్తించారు. ఉత్తుత్తి ఫోటోలు సృష్టించారు. పాత చరిత్రను మార్చి కొత్త ఇమేజి తేవడానికి తంటాలు పడ్డారు. ఆఖరుకు నరేంద్రమోడీ బిజెపి కార్యాలయం తుడుస్తున్న ఫోటో, ఛారువాలా కథ, చదువుకున్న పట్టాలు ఏవీ నిజమని నిరూపించుకోలేకపోయారు. ఈ పట్టాను గురించిన సమాచారం ఇవ్వవలసిందిగా సంబంధిత సంస్థను ఆదేశించినందుకు తెలుగువాడైన జాతీయ సమాచార హక్కు కమిషనర్ డాఎం మాడభూషి శ్రీధర్‌ను తప్పించారు కూడా. బిజెపి, ఆరెస్సెస్ మార్కు అసత్య కథనాలు కట్టుకథలు తట్టుకోలేక వార్తాసంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసి వచ్చింది. ప్రత్యేక పరిశోధకులను నియమించి నిరూపించవలసి వచ్చింది. ఇదిగో ఈ ఫోటోను మార్ఫింగ్ చేసి కొత్తది తయారు చేశారని లేదంటే అబద్ధాలతో లేని కథ వండివార్చారని సోదాహరణలతో ఎన్నో కథనాలు బయటపెట్టాయి. కొన్నిసార్లు ఈ పరిశోధన తీవ్ర ఇరకాటంలో పెట్టింది. తమ నిజస్వరూపం బయట పెట్టిన వారిపై కక్ష సాధింపులకూ వేధింపులకూ పాల్పడింది. ఆల్ట్ మీడియా అనే సంస్థ ఇందులో విశేషమైన కృషి చేసింది గనక ఆ సంస్థ అధినేతలలో ఒకరైన మహమ్మద్ జుబేర్‌ను జైలుపాలు చేసింది. సరిగ్గా ఇప్పుడు ఆ అనుభవాన్నే మోడీ సర్కారు మరోవైపు నుంచి ప్రయోగించడానికి సిద్ధమైంది. ఫేక్ న్యూస్ ప్రసారం చేస్తే సహించేది లేదని బెదిరించడమే గాక ఏది నిజం ఏది ఫేక్ అని నిర్ధారించే అధికారం తన చేతుల్లోకి తీసుకుంటున్నది. విమర్శనా స్వేచ్ఛకు, వాస్తవాల వెల్లడికి సాధనాలుగా వుండాల్సిన మీడియా, సోషల్ మీడియాలను నియంత్రించేందుకు కొత్త చట్టాలు బిగిస్తున్నది.

**ఏమిటీ సవరణ?**

సోషల్ మీడియా ఇంతగా విస్తరించక ముందు ఇన్ఫర్మేషన్ చట్టం-2000 పని చేస్తూ వచ్చింది. ఈ చట్టంలో సెక్షన్ 69(1) కింద ఏదైనా సంస్థ లేదా మీడియా ప్లాట్‌ఫారమ్ ప్రకటించిన వార్త దేశానికి హానికరమైనదని, ఉద్రేకాలు పెంచుతుందని భావిస్తే పోలీసులు కేసు పెట్టొచ్చు. మారిన పరిస్థితులలో ఆ చట్టం సరిపోలేదని 2019లో ఫేక్ వార్తల అదుపునకు పిఐబి కమిటీ వేశారు. 2021లో కొత్త సవరణ తీసుకొచ్చారు. వాటి ప్రకారం బనాయించిన అనేక కేసులు సుప్రీం కోర్టు ముందు విచారణలో వున్నాయి. చాలాసార్లు అత్యున్నత న్యాయమూర్తులే వీటిపై విమర్శలు చేశారు, కేంద్రం తన వైఖరి చెప్పాలని తాఖీదులిచ్చారు. కేంద్రం ఆరు నెలల గడువు కోరింది. ఈ కాలంలో ఆ ఆంక్షలు అమలులో వుండవని సుప్రీం ప్రకటించింది. మరోవైపు 2021 సమాచార సాంకేతిక పరిజ్ఞానం నిబంధనల సవరణ ముసాయిదా తీసుకొచ్చింది. దాంతో వ్యూహాత్మకంగా కేంద్రం కొత్త ఎత్తు ఎత్తింది. ఆ ప్రకారం పిఐబి నియమించే ఫేక్‌వార్తల నియంత్రణ కమిటీ లేదా ప్రభుత్వం అందుకోసం నియమించే మరేదైనా కమిటీకి ఏకపక్ష నిషేధ అధికారం కల్పించారు. ఆన్‌లైన్ గేమింగ్‌ను నిరోధించడానికి ఈ చట్టం తెచ్చామని పైకి చెబుతున్నారు గాని నచ్చని అంశాల ప్రచురణలను తొక్కిపట్టడం కోసం అంతకన్నా తీవ్రమైన అంశం జోడించారు. సోషల్ మీడియా వేదికలలో అంటే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి వంటి వాటిలో వచ్చిన వార్తా కథనాలు (కంటెంట్) అవాస్తవమైతే వాటిని తొలగించే అధికారం పిఐబికి వుంటుందని ఆ సవరణలో ప్రతిపాదించారు. వాటిని తీసేయవలసిందిగా ఆదేశిస్తే మధ్యంతర వ్యవస్థలైన అగ్రిగేటర్లు (అంటే వాటిని నిర్వహించే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి సంస్థలు) అమలు చేయవలసి వుంటుంది. బూటకపు కథనాలు తొలగిస్తే మంచిదే కదా అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ అసలు సమస్య అక్కడే ఉత్పన్నమవుతుంది. ఏది నిజమో ఏది బూటకమో నిర్ణయించేది ఎవరు? వాటికి కొలబద్దలేమిటి?

**గత అనుభవాలేమిటి?**

గతంలో నియమితమైన పిఐబి కమిటీ అనుభవం తీసుకుంటే చాలా దారుణంగా వుంది. అనేకసార్లు ఈ కమిటీ కొన్ని వార్తలు బూటకమని (ఫేక్) ప్రకటించింది. కాని ఈ ప్రకటనలే బూటకమైనాయి. సంఘపరివార్ లేదా ప్రభుత్వం విడుదల చేసే ఫేక్‌లు తేల్చడానికి సోషల్ మీడియాలో కొందరు కృషి చేస్తూ వచ్చారు. ఉదాహరణకు 2020 డిసెంబరులో కేంద్ర నిఘా విభాగం (ఐబి) తరపున విడుదలైన నియామకాలకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్ బూటకమని గొప్పగా ప్రకటించింది. తర్వాత చూస్తే అది అధికారికంగా ఇచ్చిందేనని తేలింది. పిఐబి తన ట్వీట్‌నే తొలగించుకోవాల్సి వచ్చింది. ఇక పరివార్ దుష్ప్రచారాలకు లోటే లేదు. కరోనా సమయంలో ఆర్ణబ్ గోస్వామి వంటి వారు వలస కార్మికులు తరలిపోతున్న ఫోటోను మసీదు బ్యాక్‌గ్రౌండ్‌తో ఇవ్వడం ఎంత కలవరం కలిగించిందో గుర్తుండే వుంటుంది. కరోనా కాలంలో ఢిల్లీలోని తబ్లిగీ జమాయత్ మర్కజ్ సంస్థలో ఏం జరిగింది? ఈ విషయంలో అప్పట్లో ప్రధానితో సహా చేసిన ప్రకటనలు ఎలా వున్నాయి? మతాల మధ్య చిచ్చు పెట్టడానికి తప్పుడు కథనాలు వదలడంపై చివరకు సుప్రీం కోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. హత్రాస్ ఘటన లోనూ బూటకపు చిత్రాలు వచ్చాయి. నిజమైన ఫోటోలు మార్ఫింగ్ ఫోటోలు పక్కపక్కనే చాలాసార్లు ప్రచురితమైనాయి (ఇలాంటి దారుణమైన అనుభవాలు తెలుగు రాష్ట్రాలలోనూ వున్నాయి. వాటిలోకి వెళితే ఎవరు ఏమిటి అన్నది మరో వివాదమవుతుంది.). విచిత్రమేమంటే పిఐబి ఏర్పాటు చేసిన కమిటీ పరివార్ ప్రచారాల జోలికి పోయిందే లేదు. వారు వెల్లడించిన, ఖండించిన కథనాలలో నూటికి తొంభై ప్రతిపక్షాలకు సంబంధించినవే. రాహుల్ గాంధీ యాత్ర సందర్భంలో ఫోటోలు లేదా ప్రకటనలు, ఇతర ప్రతిపక్షాలు లేదా మీడియా సంస్థలు కథనాలు సమాచారాలపైనే ఎక్కడలేని కేంద్రీకరణ చూపించడం అనుభవంలో చూశాం. పిఐబి అనేది మౌలికంగా ప్రభుత్వ విధానాలను లేదా కృషిని ప్రజలకు మీడియాకు తెలియజేయడానికి ఉద్దేశించిన సంస్థ. ఆ సంస్థ ప్రచారంలో పెట్టే విడుదల చేసే ప్రకటనలు ఎంత వరకూ నిజమని తేల్చవలసిన బాధ్యత మీడియా పైన సోషల్ మీడియా పైన ఇంకా ప్రతిపక్షాలు ప్రజా సంస్థల పైన వుంటుంది. దీన్ని అటూ ఇటూ తిప్పి తక్కిన వారిపై నిఘా వేసి కంటెంటు తొలగించే అధికారాలివ్వడం తలకిందులు తర్కం. ఉదాహరణకు ఇటీవల ప్రధాని విశాఖ పర్యటనకు వచ్చినపుడు జరిగిన కార్యక్రమాలలో తొంభై శాతం శంకుస్థాపనలు మాత్రమే. ఆ విషయం గట్టిగా చెబితే పిఐబి దాడి చేస్తుంది. ఎందుకంటే ఆ శంకుస్థాపనలు అంచనాల మొత్తంవారు అభివృద్ధి కింద చూపిస్తుంటారు. 'ఊరి' సైనిక కేంద్రంపై దాడి, పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ వంటి వాటిపై విపరీత ప్రచారం జరుగుతుంది. వాటికి సంబంధించిన నిజానిజాలు అడిగితే దేశభద్రతకు ముప్పంటారు. ఇంకా చెబితే దేశద్రోహం ముద్ర వేస్తారు. భారత్-చైనా సరిహద్దులలో పరిస్థితిపై ఏవో కథనాలు వస్తాయి. పూర్తి వివరాలు అడిగితే దాటేస్తారు. ప్రత్యారోపణలు చేస్తారు. ఇలాంటి అనేక సందర్భాలు చూశాం. అసలు పరిశోధనాత్మక జర్నలిజంలో జరగాల్సిందే అది. మోడీ ప్రభుత్వం క్రమంగా ఆ విధమైన పరిశోధనాత్మక జర్నలిస్టులనే వేటాడి ద్రోహుల జాబితాలో చేర్చింది. సర్వాధికారాలు పిఐబికి కట్టబెట్టే కొత్త నిబంధనలు వస్తే గనక ఏలినవారు చెప్పే అసత్య కథనాలు, లేనిపోని గొప్పలే జనానికి వార్తలవుతాయి. ప్రశ్నించడం పరిశోధించి రాయడం అపరాధమవుతుంది. పిఐబి వాటిని తొలగించాలని ఆదేశిస్తుంది. అంటే ఏ ప్రభుత్వ నిర్వాకాలనూ నిజాలనూ మీడియాలో సోషల్ మీడియాలో నిగ్గు తేల్చడం జరగాలో అదే తీర్పరిగా, నియంత్రణకర్తగా మారిపోతుంది. విడుదల చేసిన ముసాయిదాలో దానిపై నిర్దిష్టమైన కొలబద్దలు కూడా లేవు.

ఈ కారణంగానే ప్రతిపక్షాలూ మీడియా సంస్థలూ పత్రికా యాజమాన్యాలు, ముక్తకంఠంతో ఒక్క గొంతుతో సమాచార స్వాతంత్ర్యం మెడపై కత్తి లాంటి ఈ సవరణలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాయి. ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్ (ఎన్‌బిడిఎ), ది ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్), అనేక జర్నలిస్టుల సంఘాలు ఈ మేరకు సవివరమైన సోదాహరణమైన ప్రకటనలు చేశాయి. ఒత్తిడి, విమర్శలు పెరిగాక కేంద్ర ప్రభుత్వ ఐటి శాఖామంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కొన్ని సన్నాయి నొక్కులతో కొన్ని వివరణలు ఇచ్చారు.

## పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి..: తల్లాడ ఎంపీడీవో రవీంద్రారెడ్డి..



తల్లాడ, జనవరి 30 (ప్రజా పాలన న్యూస్): పౌర హక్కులను దళితులు, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని తల్లాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి భీమిరెడ్డి రవీంద్రారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని నూతనకల్లు గ్రామంలో గ్రామ సర్పంచ్ తూము శ్రీనివాసరావు అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను దళితులు, గిరిజనులు ఎలా పొందాలనే దానిపై వారికి క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. మహిళల హక్కులు వాటి విధి, విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, వార్డెన్, ఆర్ఐ శ్రీనువాస్, హెచ్ఎం వెంకటేశ్వరరావు, సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మృత్యుంజయ స్వామి దేవస్థానం ధ్వజస్తంభం ఉత్సవం



మధిర రూరల్ జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో రెండో కాశీగా పిలవబడుతున్న మృత్యుంజయ స్వామి దేవాలయంలో జనవరి ఒకటో తేదీ నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు మధిర పట్టణంలోని వైరా నదిలి లితీరాన వేంచేసి ఉన్న శ్రీ మృత్యుంజయ స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం స్వామివారి విగ్రహాల ప్రతిష్టఫిబ్రవరి 5వ తేదీన వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూరీలిదానిలో భాగంగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శివాలయం చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు తెలిపారు.ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులై స్వామి తీర్థప్రసాదాలువారు తెలిపారు.

## రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావు కలిసి వినతి పత్రం అందించిన వడ్డెరలు



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిది :తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్‌రాష్ట్ర అధ్యక్షులు అండ్ చైర్మన్శివరాత్రి అయిలమల్లు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వడ్డెర ఎస్టీ సాధన కార్యక్రమంలో భాగంగా ఈరోజు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం ఇచ్చే కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దండుగుల వెంకటరమణ... ఆధ్వర్యంలో ఉండరా ఎస్టీ సాధన హక్కులపై శాంతియుతంగా ర్యాలీ రిలే నిరాహార దీక్ష జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా మా వడ్డెర్ల స్థితిగతులు మారడం లేదు.ఈ రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కులాన్ని గుర్తించి మాకు న్యాయబద్ధంగా రావాల్సిన హక్కులను అందించాలని జిల్లా కలెక్టర్ గారిని కోరడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం రానున్న అసెంబ్లీ సమావేశంలో మా వడ్డెర్ల స్థితిగతులపై మాట్లాడి. వడ్డెర కులానికి గుర్తించి మాకు న్యాయబద్ధంగా రావాల్సిన హక్కులు మాకు కల్పించక పోతే రానున్న రోజుల్లో భారీ ఎత్తున ఉద్యమాలు ధర్నాలు రాస్తారోకోలు చేపడతామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నాము.

మా డిమాండ్లు

1).వడ్డెర్లను బీసీ నుండి తొలగించి ఎస్టిలో చేర్చాలి.

2).వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పల శ్రీశైలం , పల్లపు అశోక్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముద్దంగుల చెన్నయ్య, రాష్ట్ర కోశాధికారి పల్లపు నారాయణ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి భవాని జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మక్కల సంతోష్ జిల్లా కార్యదర్శి మంజుల నాగేష్ జిల్లా సలహాదారుడు దేరంగుల నర్సింహ్మా ఎం అంజయ్య చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు షాబాద్ మండల అధ్యక్షుడు గోగుల ఆంజనేయులు బాలపూర్ మండల అధ్యక్షుడు గండికోట యాదయ్య అబ్దుల్లాపూర్మెట్ మండల అధ్యక్షుడు ఇరగదీన్ల సురేష్, తలకొండపల్లి మండల అధ్యక్షుడు బోదాస్ నరసింహ్మ, మహేశ్వరం మండలం అధ్యక్షుడు సంపంగి రాజు,యాచారం మండల అధ్యక్షుడు గండికోట వెంకటేష్ ఈ కార్యక్రమంలో పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ టిపిని బలోపేతం చేయాలి: వైఎస్ఆర్ టిపి రాష్ట్ర పరిశీలకులు బండారి అంజన్ కుమార్ రాజు



వికారాబాద్ బ్యూరో 30 జనవరి ప్రజా పాలన : వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని బూతు స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్ఆర్ టిపి రాష్ట్ర పరిశీలకులు బండారి అంజన్ కుమార్ రాజు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు మామిడి సంగమేశ్వర్ వికారాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఉప్పరి ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పరిశీలకులు బండారి అంజన్ కుమార్ రాజు మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఎమ్మెల్యేలను భారీ మెజారిటీతో గెలిపించి తొలి మహిళా ముఖ్యమంత్రిగా వైఎస్ షర్మిలను చూద్దామని ఆకాంక్షించారు. బిఆర్ఎస్ పార్టీ అసమర్థ పాలనను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ధ్వజమెత్తారు. కెసిఆర్ కుటుంబ పాలనకు ప్రజలు త్వరలో బుద్ధి చెప్పనున్నారని జోస్యం చెప్పారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకురాలు వైఎస్ షర్మిల చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభిస్తుండడం గర్వించదగిన విషయమని స్పష్టం చేశారు. ఏ ప్రాంతానికి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వివరించారు. వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ ఉప్పరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను సమన్వయ పరుస్తూ కార్య దీక్షతో ఒక సైనికుడిలా కృషి చేస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. వైఎస్ షర్మిల ఏ క్షణంలో ఏ సమయంలో పార్టీని పెట్టారో అప్పటినుండి కెసిఆర్ ప్రభుత్వానికి బీటలు కదులుతున్నాయని ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యేలకు మంత్రులకు సీఎం కేసీఆర్ ను కలిసి నియోజకవర్గ సమస్యలను చెప్పేందుకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. ఒక నియంతలా తెలంగాణ రాష్ట్రంలో రాచరిక పాలన చేస్తున్నాడని ధ్వజమెత్తారు. పార్టీ అంటేనే కార్యకర్తలు రాజకీయ ప్రతినిధులు అందరి అభిప్రాయాలను తీసుకొని పాలన కొనసాగించాల్సి ఉంటుందని చెప్పారు. సీఎం కేసీఆర్ నేనే మంత్రి నేనే రాజు నేనే ప్రజలుగా భావిస్తూ మూర?ంగా పాలన కొనసాగిస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి వసంత్ కుమార్ వికారాబాద్ యూత్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ సోషల్ మీడియా ఇన్చార్జ్ శశివర్ధన్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కుమార్ తదితర వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కార్యకర్తలు హితైషులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాంద్రాయన్ పల్లి మాడల్ సిద్ధం చేయాలి: వికారాబాద్ జిల్లా కలెక్టర్ కె నిఖిల



వికారాబాద్ బ్యూరో 30 జనవరి ప్రజా పాలన : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడి మోడల్ పాఠశాలల పనులను రేపటి వరకు అన్ని హంగులతో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నిఖిల అన్నారు. సోమవారం మోమిన్ పేట మండలంలోని చాంద్రాయన్ పల్లి, అమరాదికుర్దు గ్రామంలో ఎంపికైన మోడల్ పాఠశాల పనుల పురోగతిని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఎపికైన మన ఊరు మనబడి మోడల్ పాఠశాలలను త్వరలో ప్రారంభించుకో బోతున్నామని, పనులలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అన్ని రకాల పనులను రేపటి వరకు పూర్తి చేసి అన్ని హంగులతో సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. అవసరమైన గ్రీన్ చాక్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకా దేవి, పంచాయతీ రాజ్ ఏ ఈ ప్రణీత్ చాంద్రాయన్ పల్లి సర్పంచ్ అంజయ్య, అమరాది కుర్దు సర్పంచ్ సునీత, ఎం ఈ ఓ గోపాల్, ఆర్ ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాట్యమండలి జిల్లా మూడవ మహాసభల సందర్భంగా వీధి నాటకోత్సవములను జయప్రదం చేయండి

**ప్రజానాట్యమండలి ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి పి.దనేశ్వర్...**



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిధి: కళ కళ కోసం కాదు...కళాకాసుల కోసం కాదు... కళా ప్రజల కోసం.. అనే నినాదంతో ప్రజలను చైతన్య చేస్తూ ప్రజానాట్యమండలి రంగారెడ్డి జిల్లా మూడవ మహాసభలు ఫిబ్రవరి 26 ,27 ,28 తేదీలలో ఇబ్రహీంపట్నంలో జరగబోతున్నాయి...దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ అడుగుజాడల్లో నడుస్తూ కష్టజీవుల పక్షాన సాంస్కృతిక మార్గంలో ముందుకు సాగుతుంది. ప్రజానాట్యమండలి. ఆదిశగానే ఆట పాట ప్రవహిస్తుంది.పనిలో కష్టం మరిపించేందుకు మంచి మనిషి సృష్టించుకున్న కలను వారి కష్టాలను తుడిచే ఆయుధంగా మార్చింది ప్రజానాట్యమండలి.ధనవంతులో కుబేరులుగా పేదలు మరింత పేదలుగా మారుతున్న ఈ తరుణంలో కరోనా వారి కష్టాలని రెట్టింపు చేసింది.అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు సమస్యలను వదిలి స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి ధనవంతులకు మద్దతిస్తూ పేదల్ని చీల్చేందుకు కుల మత పేరుతో చిచ్చులు రాజేస్తున్నాయి మీడియా ప్రచార సాధనాలని పావులుగా వాడుకుంటూ అనత్యాలను విస్తరింపజేస్తున్నాయి వీటన్నిటికీ దీటుగా బదులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.జన చైతన్యం కోసం ప్రజా సంస్కృతిని కాపాడుకుంటూ ఏనాటికైనా మనిషి అజేయుడనే సత్యాన్ని వెలిగెత్తి చాటాలి ఈ కర్తవని దశాబ్దాలుగా నిర్వహిస్తోంది. గతంలో రంగారెడ్డి జిల్లాలో మూఢనమ్మకాల పైన అంటరానితనం పైన కులం పైన అనేక సాంస్కృతి కార్యక్రమాలు చేసి ప్రజలను చైతన్యవంతం చేసి తనదైన శైలిలో ప్రజానాట్యమండలి ముద్ర వేసుకుం.ది ఇలాంటి తరుణంలో రంగారెడ్డి జిల్లా మూడో మహాసభలు పోరుగడ్డ ఇబ్రహీంపట్నం ప్రాంతంలో మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో కళాకారులు తోపాటు అన్ని వర్గాల ప్రజలు ఆధార అభిమానులతో జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## భారత్ జోడో యాత్ర విజయవంతం



ప్రజాపాలన షాబాద్ :ఏఐసిసి మాజీ అధ్యక్షులు, శ్రీ రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "భారత్ జోడో యాత్ర" కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 3532 కిలోమీటర్లు విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగింది. ఈ శుభ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రథసారథి, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి అన్న ఆదేశాల మేరకు షాబాద్ మండల కేంద్రంలో జాతీయ జెండా ఆవిష్కరించడం జరిగింది. అదేవిధంగా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వారి యొక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.అనంతరం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేధిస్తున్న విధానాలను గాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలకు నిరంకుశ పాలనను గద్దె దించి రాబోయే ఎన్నికలలో కేంద్రంలో గాని రాష్ట్రంలో గాని ఈ రాబందుల పాలనను సాగనంపి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని స్థానిక షాబాద్ మండలంలో ప్రత్యేకమైనటువంటి పైల్వాన్ షావలి దర్గాలో శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో షాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, వెంకట్ రెడ్డి,ఎల్గొండగూడ సర్పంచ్ ఎల్గంటి ప్రతాప్ రెడ్డి మాజీ సర్పంచులు ఆర్ శేఖర్, బుర్ర ఆంజనేయులు గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు తమ్మలి రవీందర్, ఎలుగంటి రాఘవరెడ్డి, బండ వెంకటరెడ్డి, నరెడ్లగూడెం జంగయ్య, నాయకులు రవీందర్ యాదవ్ ,పలుగుట్ట సత్యం, బేగరి శేఖర్ ,గౌరీశ్వర్, గౌతమ్, మల్లేష్, ఇక్బాల్, ఎండి బురాన్, దస్తగిర్, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి ,కృష్ణ ,శ్రీనివాస్ ,ప్రవీణ్, చంద్రయ్య, యాదయ్య యు నోస్, రాజు, శివకుమార్ శ్రీనివాస చారీ తదితరులు పాల్గొన్నారు.

## రాళ్ళచిట్టంపల్లి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ: సర్పంచ్ ముష్లయాస్మిన్ గౌస్



వికారాబాద్ బ్యూరో 30 జనవరి ప్రజాపాలన : సీఎం కేసీఆర్ ఆడపిల్లల పెళ్ళిళ్ళకు కుటుంబ పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని రాళ్ళచిట్టంపల్లి గ్రామ సర్పంచ్ ముష్ల యాస్మిన్ గౌస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మందు భాగంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గ్రామ సర్పంచ్ మష్లయాస్మిన్ గౌస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాళ్ళచిట్టంపల్లి గ్రామ సర్పంచ్ మష్లయాస్మిన్ గౌస్ మాట్లాడుతూ ఎన్కతల సువర్ణకు కళ్యాణ లక్ష్మి, మొల్ల నస్రీన్, మొల్ల షరీఫాబీ, ముర్తుజా హసీనా బీ, సిరిపురం ఖుద్రత్ బీలకు షాదీముబారక్ చెక్కులను అందజేశామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వచ్చిన డబ్బులను కుటుంబ అవసరాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ అతి ముఖ్యమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాళ్ళచిట్టింపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ద్యాచారం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ: గ్రామ సర్పంచ్ ఎల్లన్నోల అంజయ్య



వికారాబాద్ బ్యూరో 30 జనవరి ప్రజా పాలన : ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి పథకం కల్పతరువుగా నిలుస్తున్నదని ద్యాచారం సర్పంచ్ ఎల్లన్నోల అంజయ్య అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ద్యాచారం గ్రామ సర్పంచ్ ఎల్లన్నోల అంజయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ద్యాచారం గ్రామ సర్పంచ్ ఎల్లన్నోళ్ల అంజయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే పరమావధిగా కృషి చేస్తున్నారని కొనియాడారు బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయుటకు కంకణం కట్టుకున్న సీఎం కేసీఆర్ అని స్పష్టం చేశారు ద్యాచారం గ్రామంలో ఏ సమస్యలు ఉన్నా వెంటనే నా దృష్టికి తెచ్చినచో వాటి పరిష్కారం కొరకు కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ళ మల్లికార్జున్, పి.సంగమేశ్వర్, బాల్ రాజ్, పి.సంగెం, పి.గోపాల్, టి.భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలి: జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావు



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిధి: సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై పిర్యాదులను సమర్పించడానికి వచ్చిన ప్రజల నుండి జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతి రావు పిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యదులను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి ద్వారా 60 పిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి: వికారాబాద్ జిల్లా కలెక్టర్ కే నిఖిల



వికారాబాద్ బ్యూరో 30 జనవరి ప్రజా పాలన : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడి మోడల్ పాఠశాలల పనులను రేపటి వరకు అన్ని హంగులతో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నిఖిల అన్నారు. సోమవారం నవాబుపేట మండలంలోని మాదారం గ్రామంలో ఎంపికైన మోడల్ పాఠశాల పనుల పురోగతిని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఎపికైన మన ఊరు మనబడి మోడల్ పాఠశాలలను త్వరలో ప్రారంభించుకో బోతున్నామని, పెండింగ్ పనులు అన్నింటిని రేపటి వరకు పూర్తి చేసి అన్ని హంగులతో సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, హ్యాండ్ వాష్, ఫ్లోరింగ్, కలరింగ్ పనులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఫ్లవర్ పార్ట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన గ్రీన్ చాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకా దేవి, టీఎస్ ఈడబ్ల్యూఐడిసి డి ఈ రాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ చంద్ర, సర్పంచ్ అంజయ్య, ఎంఈఓ గోపాల్, ఎంపీఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్సై దేశ్ చంద్రశేఖర్




శంకరపట్నం జనవరి 30 ప్రజాపాలన రిపోర్టర్:భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో 2023వ సంవత్సర రూపొందించిన నూతన క్యాలెండర్ను సోమవారము శంకరపట్నం మండల పోలీసుస్టేషన్ లో ఎస్సై దేశ్ చంద్రశేఖర్, ఏఎస్సైఐ మల్లారెడ్డి, సుధాకర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై దేశ్ చంద్రశేఖర్ గారు మాట్లాడుతూ.. విద్యార్థి ఉ ద్యమాలతో పాటు సామాజిక బాధ్యతతో ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ రూపొందించడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థి చదువుతూ, సమాజానికి ఉపయోగపడే సామాజిక కార్యక్ర మాలు రూపొందించుకొని ముందుకు సాగాల న్నారు. పేద విద్యార్థులకు ఉ పయోగపడే ఏ మంచి కార్యక్రమానికైన పోలీసు శాఖ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, ఆకాష్, కర్ణకర్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | | | |
|---|---|---|---|---|
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| టి.రాంబాబు | - | శేర్లింగంపల్లి | - | 6301925113 |
| సత్య కిషోర్ | - | అమీర్‌పేట | - | 6309723472 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | - | మధిర రూరల్ | - | 6305269141 |
| సి.మల్లేష్ | - | ఇబ్రహీపట్నం | - | 9618028334 |
| దుంపాల రాజేష్ | - | మేడ్చల్ | - | 9000178307 |
| వై.నర్సింహులు | - | తాండూరు | - | 7207677049 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| ఎన్.బండయ్య | - | చేవెళ్ల | - | 9959032940 |
| నరేందర్ | - | చేవెళ్ల | - | 9490148304 |
| ఎం.పరమేష్ | - | శంకరపల్లి | - | 7989723793 |
| జి.అర్జున్ | - | శంకరపట్నం | - | 7386777544 |
| ఎం.యాదయ్య | - | చేవేళ్ల నియోజకవర్గం | - | 8328236516 |
| ఎం.మురళీ | - | షాబాద్ | - | 9989770468 |


## స్టడీ మెటీరియల్ అందజేసిన ఆల్ ఇన్ వన్ ఫౌండేషన్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి




ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిధి: స్టడీ మెటీరియల్ ను అందజేసిన మర్రి నిరంజన్ రెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి సంవత్సరం 10వ తరగతి చదువుతున్న తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఆల్ ఇన్ వన్ మర్రి నిరంజన్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా అందజేస్తున్నారు, అందులో భాగంగా ఈరోజు యాచారంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు %డ% మాజీ శాసనసభ్యులు ముదిరెడ్డి రెడ్డి కోదండ రెడ్డి విచ్చేసి స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు, అనంతరం యాచారం మాల్, నల్లవెల్లి, చింతపట్ల, గున్ గల్ మోడల్ స్కూల్ గూన్ గల్ హై స్కూల్ నాగన్ పల్లి పోల్కంపల్లి హై స్కూల్ లలో , తెలుగు %డ% ఇంగ్లీష్ మీడియం స్టడీ మెటీరియల్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు %డ% ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి ఉచితంగా విద్యార్థినీ విద్యార్థులకు అందజేశారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు, పాఠశాలలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల బృందం మర్రి నిరంజన్ రెడ్డి ని సన్మానించారు, స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థిని విద్యార్థులుమర్రి నిరంజన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో యాచారం ప్రిన్సిపల్ రాజేందర్, మాల్ ప్రిన్సిపల్ వరలక్ష్మి, నల్లవెల్లి ప్రిన్సి పాల్ మోహన్ రెడ్డి, చింతపట్ల ప్రిన్సిపాల్ సురేష్, గున్ గల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ హీమిమ, గున్ గల్ హై స్కూల్ ప్రిన్సిపల్ భాస్కర్, నాగన్ పల్లి ప్రిన్సిపల్ అలివేలు,పోల్కం పల్లి హై స్కూల్ ప్రిన్సిపల్ పాండురంగం, కాంగ్రెస్స్ నాయకులు కొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి,శంకర్ గౌడ్,జంగా రెడ్డి,మహిపాల్ రెడ్డి, రాంరెడ్డి, ఉదెయ్ పాల్ రెడ్డి, ఎమ్మెన్నార్ యువసేన ప్రెసిడెంట్ కమలాకర్ రెడ్డి,ప్రదీప్ రెడ్డి, నగన్ పల్లి సర్పంచ్ ఎర్ర జేగన్, ఉప సర్పంచ్ బీరప్ప,నర్సింగ్ శేఖర్ గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చరణ్ ముదిరాజ్,విద్య కమిటీ చైర్మన్ లు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని %డ% విద్యార్థులు స్థానిక నాయకులు, ఎమ్మెన్నార్ యువసేన టీం సభ్యులు పాల్గొన్నారు.

## పవర్ బాక్స్ క్రికెట్ అకాడమీ ప్రారంభానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి

ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని టిసిఎస్ పక్కన మిత్రుడు కాసారం ప్రభాకర్ రెడ్డి ఏర్పాటుచేసిన పవర్ బాక్స్ క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ. కాంగ్రెస్ నాయకులు సొప్పరి రవికుమార్ (టోనీ)..పాశం జైహింద్..చనమోని గోపాల్..దయాకర్..శివ..శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేడివల్లి, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ చర్చి స్కూల్ 1993 సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘట్కేసర్ లోని ఉ దయలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు వారి అనుభవాలను పంచుకొన్నారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాస్ రెడ్డి రియల్ ఎస్టేట్, దేవిడ్ రాజు ఆస్ట్రేలియా రిటన్ ,ధనుంజయ గౌడ్ టిఆర్ఎస్ మలిదశ ఉద్యమ కారుడు, బిక్షమయ్య వ్యాపారం , శ్రీనివాస్ రియల్ ఎస్టేట్, జంగయ్య, అనిల్, సుధాకర్ ,ఉదయలక్ష్మి సైకాలజిస్ట్, రోజా రాణి డి ఆర్ డి ఓ, లూసి మేరీ గవర్నమెంట్ టీచర్, యాదలక్ష్మి గవర్నమెంట్ టీచర్, మరియాదాస్ బ్యాంక్ ఎంప్లాయ్, మంజుల కండక్టర్, ఉమారాణి బ్యూటిషన్, బిందు ప్రైవేట్ పరంజ్యోతి మ్యారేజ్ బ్యూరో, భవాని ,కవిత, అనిత వెంకటలక్ష్మి, మంజుల, కవిత సంగారెడ్డి మాధవి గ్రానైట్ షాప్, రాధా, మాధవి ,భాగ్యలక్ష్మిలు ఉన్నారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత



జన్నారం, జనవరి 30, ప్రజాపాలన: మంచి ర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గజ్జెల్లి చిరంజీవి గత కొన్ని నెలల నుండి సైనసిస్ నరాల వ్యాధి తో బాధపడుతున్న కమిటి సభ్యుడు,గల్ఫ్ కార్మికుడైన గజ్జెల్లి చిరంజీవి గారి చికిత్స కోసం గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ ఆధ్వర్యంలో 22,200 రూపాయాలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మిక వ్యవస్థ అధ్యక్షులు కల్లేడ భూమయ్య మాట్లాడుతూ వలస కూలిగా గల్ఫ్ దేశంలో అబుధాబిలో పని చేస్తూ చాలి చాలన్నీ వేతనంతో జీవన్నాని కొన్నసాగిస్తున్నారు. ఇటు వంటి సమయంలో అతనూ అక్కడే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటు అక్కడే హాస్పిటల్ లో దాదాపు రెండు నెలలు ఐసియులో ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొంది కొంతవరకు బాగు అయ్యారు. పరాయి దేశంలో ఉన్నప్పుడు టిజీడబ్ల్యూడబ్ల్యూసి దుబాయ్ శాఖ కు తెలియగానే వ్యవస్థాపక అధ్యక్షులు కల్లేడ భూమయ్య, దుబాయ్ శాఖ అధ్యక్షులు మహ్మద్ అలీమ్, కునరపు రమేష్, కల్లెడ సత్యం, సందెల తిరుపతి, ధర్మజి సతన్న లు హాస్పిటల్ కి వెళ్లి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని స్వదేశామైన ఇంటికి పంపినందుకు సహకరించారు. వలస దేశం దుబాయిలో ఆరోగ్యం తక్కువ కకపోవడంతో చికిత్స కోసం తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ సంస్థ, సభ్యులా సహకారంతో ఆర్థిక సహాయం అందజేస్తూ, గ్రామ శాఖ అధ్యక్షులు కొత్తకొండ శేఖర్, వేముల సత్తయ్య, మాట్లాడుతూ సహాయానికి సహకరించినా దన్యవాదాలు తెలిపారు. గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్నా సమస్యలపై స్పందిస్తూ కార్మికులకు ఏలాంటి సమస్యలు ఉన్న సంస్థ దృష్టికి వస్తే గల్ఫ్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సంస్థ పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగాల వెంకటేష్, సంగేపు వెంకటేష్, భూపెల్లి లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

## పట్లూరులో హనుమాన్ దేవాలయం ప్రారంభం: పట్లూరు గ్రామ సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్



వికారాబాద్ బ్యూరో 30 జనవరి ప్రజా పాలన : పట్లూరు గ్రామంలో ఫిబ్రవరి 10 11 12 తేదీలలో హనుమాన్ దేవాలయం ప్రారంభోత్సవానికి వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ను ప్రత్యేకంగా ఆహ్వానించామని పట్లూరు గ్రామ సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మర్పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ దేవరదేశి అశోక్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. దైనందిన కార్యక్రమాల్లో భాగంగా ప్రతిరోజు తమ ఇష్ట దైవాన్ని తలచుకొని కార్యక్రమాలను కొనసాగించుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజు తాను నమ్మిన దైవదర్శనము చేసుకున్నచో పనులన్నీ నిర్విఘ్నంగా పూర్తి అవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. హనుమాన్ దేవాలయం ప్రారంభానికి ఆహ్వానించిన వారిలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గొల్ల ముసలి అశోక్ కమిటీ సభ్యులు ఎస్ శ్రీశైలం కోట పాండు తదితరులు ఉన్నారు.

## కేశవపట్నం 108 అంబులెన్స్ ను తనిఖీ చేసిన కేంద్ర బృందం



శంకరపట్నం జనవరి 30 ప్రజాపాలన రిపోర్టర్ : కరీంనగర్ జిల్లా శంకర పట్నం మండలంలోని కేశవపట్నం108 అంబు లెన్స్ ను సోమవారం కేంద్ర బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యులు 108 అంబులెన్స్ ను తనిఖీ చేశారు. 108 సిబ్బంది పనితీరును కార్డులను మందులను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. 108 అంబులెన్స్ సకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు అబ్దుల్ అఫీజ్, డాక్టర్ జ్యోతి సీఎం లోట్, 108 సిబ్బంది ఈఎంటి శ్రీధర్, పైలెట్ కాజా ఖలీల్ ఉల్లా పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ టీం



శంకరపట్నం జనవరి 30 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ టీం డాక్టర్స్ జ్యోతి, సిమ్లాట్ డాక్టర్ అబ్దుల్ హాఫీజ్ ఇమ్లిక్ లు సందర్శించి, వైద్యశాల రికార్డ్ లను తానిఖి నిర్వహించారు. ఈ బృందమ్ ఆరోగ్య కేంద్రం ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి తెలుసుకొని సూచనలు చేసారు. వీరూ పరిశీలించిన రికార్డుల నివేదికను కేంద్రం ఆరోగ్యం శాఖ కు సమర్పిస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ చందు, స్థానిక వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజిద్ ,హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, వైద్య సిబ్బంది, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల పెళ్లిళ్లకు పెద్దన్న పాత్ర పోషిస్తున్న కేసీఆర్

### వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ బ్యూరో 30 జనవరి ప్రజా పాలన : ఆడపి ల్లల పెళ్లిళ్లకు సీఎం కేసీఆర్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను వివిధ గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వికారాబాద్ మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన 59 లక్షల 6 వేల 844 రూపాయల చెక్కులను 59 మందికి పంపిణీ చేశామని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో పేదింటి ఆడబిడ్డలకు కొండంత అండగా నిలుస్తున్న కెసిఆర్ ను మరువద్దని సూచించారు. ప్రతి దశలో ఆడబిడ్డలకు తోడుగా సంక్షేమాన్ని అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ మండల ఎంపీపీ కామిడి చంద్రకళ జిల్లా రైతుబంధు అధ్యక్షుడు పాతూరు రామ్ రెడ్డి పులుమద్ది గ్రామ సర్పంచ్ తిమ్మాపురం మాధవరెడ్డి, వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ గయాజ్ రాళ్లచిట్టంపల్లి సర్పంచ్ ముష్ల యాస్మిన్ గౌస్, ద్యాచారం సర్పంచ్ ఎల్లన్నోళ్ల అంజయ్య కొటాల గూడా సర్పంచ్ రాములు నాయక్ కామారెడ్డి గూడ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కలిసి వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్స్



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30ప్రజాపాలన ప్రతినిధి :ఆదిబట్ల మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ కొత్త హార్ధిక పాలకవర్గంతిరుగుబాటుకు సిద్ధపడ్డారు. 15 మంది కౌన్సిలర్లకు గాను 13 మంది అవిశ్వాసం పై సంతాకాలు చేసి సోమవారం కలెక్టర్ అమోయ్ కుమార్ కు సోమవారం మెమోరండం అందజేశారు. మున్సిపాలిటీ చట్టం, 2019లోని సెక్షన్ 37 ప్రకారం, ఆసమ్మతి పై విశ్వాసం కోరుతూ ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వార్డుసభ్యులు నల్లవోలు లావణ్య , కుంట్ల మౌనిక, కాంతి సంధ్య,కొప్పు కృష్ణరాజు, వనముల శ్రీనివాస్ కోల నగేష్ ,నీళ్ల హరిదాస్ ,గోపగళ్ల మహేందర్ ,మర్రి నిరంజన్ రెడ్డి, కోరె కళమ్మ, మర్రి అర్చన ,నారాణి మౌనిక, పొట్టి రాములు,కమండ్ల యాదగిరి సంతకాలు చేసి కలెక్టర్ కు అందజేయడం జరిగింది.

## ఘనంగా కెవి కేశవులు వర్ధంతి వేడుకలు



జన్నారం, జనవరి 30, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సోమవారం బీసీ సంఘాల నాయకుడు కేవీ కేశవులు 5వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కులాల ఐక్య పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కేవీ నరసింహులు మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కె.వి కేశవులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని అక్కపల్లిగూడెం గ్రామ వాస్తవ్యులు స్వాతంత్ర్య సమరయోధులు సిర్పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు కెవి కేశవులు గారి పదవులు కొనసాగించారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా అతను పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివిన్నారు. జన్నారం మండలంలోని అన్ని గ్రామాల బీసీ నాయకులు ప్రెస్ క్లబ్ వద్దకు హాజరై కేవి కేశవులు ఆశ్రయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కోడూరు చంద్రయ్య, మామిడి విజయ్, అడేపు సత్యనారాయణ, కాడెర్ల నరసయ్య, మూల భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆఫీస్ సబార్డినేట్ అటెండర్ కి ఘనంగా వీడ్కోలు




శంకరపట్నం జనవరి 30 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలం మక్త ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రామ సర్పంచ్ సుష్మా మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్) పదవీ విరమణ ఘనంగా నిర్వహించారు. మక్త ప్రాథమిక పాఠశాలలో గత 40 సంవత్సరాలుగా ఆఫీస్ సబార్డినేట్ అటెండర్ గా సేవలందిస్తున్న మొలంగూర్ గ్రామానికి చెందిన పూదరి పోచయ్య రేపటితో తన పదవీకాలం ముగిస్తుండగా సోమవారం ఆయనకు పాఠశాల విద్యార్థులు గ్రామస్తులు పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతోపాటు గ్రామస్తులు ఉద్వేగానికి లోనయ్యారు. 40 సంవత్సరాలుగా ఎంతోమంది గ్రామస్తులు ఆ పాఠశాలనే చదువుకొని ఉన్నత స్థాయిలకు ఎదిగారు, గ్రామ సర్పంచ్ భర్త మహేష్ కూడా అదే పాఠశాలలో చదువుకొని ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారు. నాలుగు దశాబ్దాలుగా సేవలందించి ఎంతో మంచి పేరు సంపాదించుకొని అందరితో కలివిడిగా ఉంటూ గ్రామస్తులలో ఒకరిగా ఉన్నటువంటి పూదరి పోచయ్య సాగనంపుతూ విద్యార్థులు గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎంఏ ఖాద్రి, ప్రసాద్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్, సంజీవరెడ్డి, కేశవపట్నం ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ మమతా గౌతమి, మొలంగూర్ హెచ్ఎం రోజా రమణి, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ లో 5-శాతం నిధులు, జివో 17రద్దు చెయ్యాలి




ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిధి: వికలాంగులకు రాష్ట్ర బడ్జెట్లో ఐదు శాతం నిధులు కేటాయించాలని ఆసరా పెన్షన్ల మంజూరుకు ఆదయపరిమితి విధించే జీవో 17 రద్దు చేయాలనిజిల్లావ్యాప్తంగా వికలాంగుల రుణాలు స్వయం ఉపాధి కోసం వేలాదిమంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు ఇప్పటివరకు 25 శాతం మందికి కూడా రుణాల మంజూరు చేయలేదు వికలాంగుల వివాహ ప్రోత్సాహం కోసం గత సంవత్సరం 105 మంది దరఖాస్తు చేసుకుంటే 65 మందికి మాత్రమే మంజూరు చేశారు. జిల్లావ్యాప్తంగా బ్యాటరీ వీల్ చైర్స్ కోసం 150 మంది దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి 2022 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ దరఖాస్తు చేసుకున్న వారందరికీ పరికరాలు పంపిణీ చేయడం లేదు తక్షణమే బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయించి స్వయం ఉపాధి రుణాలు పరికరాలు పంపిణీ చేయాలి ఈ కార్యక్రమంలో జిల్లా కోశాదికారి దేవరంపల్లి రాజశేఖర్ గౌడ్ జిల్లా నాయకులు బుస్సు పాండురంగారెడ్డి ఉపాధ్యక్షుడు చేగురి శేఖర్ ఎర్పుల జంగయ్య మహిళా విభాగం నాయకురాలు వేముల కుసుమ వరలక్ష్మి భుయ్యంకార్ లక్ష్మీ బాయి సాయినాథ్ మంజుల పల్లవి శ్యామల నరేష్ తదితరులు పాల్గొన్నారు .



## బసవతారకం హాస్పిటల్ లో కీమోథెరపీ డే కేర్ స్పెషల్ కేర్ వార్డ్ ను ప్రారంభించిన ఇన్నర్ వీల్ అసోసియేషన్...




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):సమాజ సేవలో ముందుండే ఇన్నర్ వీల్ అసోసియేషన్ వారు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్లో కీమోథెరపీ డే కేర్ %డ% స్పెషల్ కేర్ వార్డ్ ను ప్రారంభించారు. ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ 315 లోని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ జనవరి నెలను సర్వికల్ కేన్సర్ మాసంగా గుర్తించాయి. ఈ రెండు క్లబ్ లు కలసి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రికి 10 ఫంక్షనల్ బెడ్స్ ను విరాళంగా ఇచ్చాయి. వీటితో పాటు పిల్లోస్ మేట్రస్ బెడ్ షీట్లను పేషెంట్ లకు అందిస్తూ ఆస్పత్రిలోని కీమో థెరపీ వార్డును ప్రారంభించారు. ఈ మేరకు ఆస్పత్రిలోని కీమోథెరపీ




డే కేర్ అండ్ స్పెషల్ కేర్ వార్డులో చికిత్స పొందుతున్న పలువురు సర్వికల్ కేన్సర్ పేషంట్లను వారు పరామర్శించారు. అనంతరం కేన్సర్ పీడియాట్రిక్స్ వార్డులోని సుమారు వందమంది చిన్నారి రోగులకు పళ్లు స్టేషనరీ కిట్స్ ను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా. సూర్జిత్ కౌర్ , మిసెస్ లీలా చంద్వానీ తో సహా రెండు క్లబ్ ల ప్రెసిడెంట్స్ ... మిసెస్ బిందు గుప్తా ,మిసెస్ సిమ్రాన్ ఠాకూర్ ఇన్నర్ వీల్ సభ్యులు పాల్గొనగా వీరితో పాటు మెడికల్ డైరక్టర్ డా.టి సుబ్రహ్మణ్యేశ్వర్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డా.ఫణి కోటేశ్వర రావు, మెడికల్ సోషల్ వర్క్ డిపార్ట్ మెంట్ హెచ్ఓడీ డా.హరితా కొడాలి లు హాజరయ్యారు.

## తెలంగాణలోని రైల్వే ప్రాజెక్టుల పట్ల కేంద్రం వివక్ష : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశించిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. దీంతో పాటు తెలంగాణలో మరిన్ని రైల్వే లైన్లను ఏర్పాటుచేసి రైల్ కనెక్టివిటీని పెంచాలన్న తమ ప్రభుత్వ డిమాండ్ను మోదీ ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని కేటీఆర్ ఆరోపించారు.

**తెలంగాణ నుంచి దక్షిణ మధ్య రైల్వేకు పెద్దఎత్తున రాబడి**

సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నదన్న కేటీఆర్, ఆహార ధాన్యాల ఉత్పత్తితో పాటు ఐటీ ఎగుమతుల వరకు దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే మెరుగ్గా తెలంగాణ వృద్ధి కొనసాగుతుందన్నారు. ఈ ప్రగతిని మరింత బలోపేతం చేస్తూ రైతులు, ప్రజల ప్రయోజనార్థం లాజిస్టిక్స్ రంగంలో అనేక మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందన్నారు. అటు సరుకుల రవాణాతో పాటు ప్రయాణికుల టికెట్లతో దక్షిణ మధ్య రైల్వేకు తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున రాబడి వస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. సికింద్రాబాద్, కాజీపేట జంక్షన్లు ఉత్తర, దక్షిణ భారతదేశానికి కనెక్టింగ్ పాయింట్గా ఉన్నాయన్నారు. అయితే తీర ప్రాంతం లేనందున సరుకు రవాణా కోసం రైల్వే లపైనే తెలంగాణ ఎక్కువగా ఆధారపడుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని కేటీఆర్ కోరారు.

**మోదీ అధికారంలోకి వచ్చాక ఒకే ఒక కొత్త రైలు..**

నూతనంగా ఏర్పాటు చేసే రైల్వే మార్గాలు, ఇతర మౌలిక వసతులతో తెలంగాణ ప్రగతి మరింత వేగంగా ముందుకు సాగుతుందని.. అయితే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఏ మాత్రం సహాయం చేయడం లేదన్నారు కేటీఆర్. గత 8 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రంలో కేవలం 100 కిలోమీటర్ల పొడవైన రైల్వే ట్రాక్ మాత్రమే వేశారని తెలిపిన కేటీఆర్, దేశంలో ఉన్న మొత్తం రైల్వే నెట్వర్క్లో తెలంగాణ కేవలం మూడు శాతం మాత్రమే కలిగి ఉన్నదన్నారు. ఇందులో 57 శాతం కేవలం సింగిల్ రైల్వే ట్రాక్ మాత్రమే అన్నారు. కొత్త రైల్వే లైన్లను కనీస మాత్రంగా కూడా కేంద్ర ప్రభుత్వం వేయలేదన్న కేటీఆర్.. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని- లింగంపల్లి %--% విజయవాడ ఇంటర్ సిటీ పేరుతో కేవలం ఒకే ఒక కొత్త రైలును వేశారని తెలిపారు. లోక్ సభ, రాజ్యసభ ఎంపీలతో సమావేశాలు ఏర్పాటు చేసి నూతన ప్రాజెక్టులు, రైలు సౌకర్యాల విషయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు గతంలో చర్చించేవారని అయితే ఈ ఏడు ఈ సాంప్రదాయాన్ని సైతం పక్కనపెట్టి విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు.



**మధిర హ్యుందాయ్ షోరూం లో నూతన హ్యుందాయ్ i10neon వాహనాన్ని ప్రారంభించిన మధిర మునిసిపల్ చైర్మన్ మొండితోక లత వారితో షోరూం మేనేజర్ వేణు బాబు మరియు మధిర ఎస్బిఐ మేనేజర్ , షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.**

## కాంగ్రెస్ పార్టీ టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు రవి చేరారు



ఇబ్రహీంపట్నం జనవరి తేదీ 30 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కప్పాడు గ్రామానికి చెందిన జంగిలి రాము ఏఐఎస్ఎఫ్ మాజీ మండల అధ్యక్షులు రవి తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో పీసీసీ ఉపాధ్యక్షులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇన్చార్జ్ మల్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది ఈ సందర్భంగా పిసిసి ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగ రెడ్డి మాట్లాడుతూ. రాష్ట్రంలో దేశంలో అవినీతి పేరుకుపోయిందని అదేవిధంగా తెలంగాణలో దొరల పాలన నడుస్తుందని యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయని పేదలకు డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వకుండా నిరుద్యోగ భృతి ఇవ్వకుండా ఇండ్ల స్థలాలు లేక కొత్త పింఛన్లు లేక కొత్త రేషన్ కార్డులు లేక చాలా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు అని ఈ సందర్భంగా తెలపడం జరిగింది రాబోయే కాలంలో కేంద్రంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని గౌతమ్ ఏర్పాటు చేయగానే పేదలకు యువతకు సంబంధించి అన్ని రకాల పనులు చేస్తామని తెలపడం జరిగింది. ఇప్పుడున్న పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీ సరైన పార్టీ అని యువత ముందుకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో కలవడం జరుగుతూ ఉన్నది ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు రమేష్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మంకాల కర్ణాకర్ కోడూరు పాండు మహేందర్ తది తరులు పాల్గొన్నారు.

## పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

**జిల్లా పశువైద్య,పశు సంవర్ధక శాఖ అధికారి అనిల్ కుమార్**



వికారాబాద్ బ్యూరో 30 జనవరి ప్రజా పాలన : పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగ్గా వేయించాలని జిల్లా పశువైద్య,పశు సంవర్ధక శాఖ అధికారి అనిల్ కుమార్ అన్నారు. జాతీయ బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగడి,మద్గుల్ చిట్టంపల్లి పశు వైద్యశాలలో మండల పశు వైద్యాధికారి టి.ఉష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ,బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకినట్లయితే ఆడ చుడీ పశువులు ఈడ్చుకు పోవడం జరుగుతుందని,ఈ వ్యాధి ముఖ్యంగా పశువుల నుంచి మనుషులకు సోకె అవకాశం ఉంటుందని అన్నారు. పశువుల నుంచి మనుషులకు ఈ వ్యాధి సోకితే వంధ్యత్వం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వ్యాధి వల్ల దేశ,రాష్ట్ర వ్యాప్తంగా పాడిపశువుల యజమానులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని హెచ్చరించారు. వ్యాధి నివారణ టీకాలు ఆడ లేగ,గేదె దూడలకు 4-8 నెలల వయసు వాటికి ఇచినట్లు అయితే జీవిత కాలం ఈ వ్యాధి బారిన పడకుండా ఉంటాయని అన్నారు. ఈ వ్యాధి సోకితే పశువులో పాల ఉత్పత్తి తగ్గుతుందని,మేత మేయవని అన్నారు. కిల్లవాతం, పశువులు కుంటుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ప్రహ్లాద్ ఉన్నారు.

## చప్పగా సాగిన పౌర హక్కుల దినోత్సవం



శంకరపట్నం జనవరి 30ప్రజాపాలన రిపోర్టర్ :శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ బత్తుల మానస ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అధికారులు హాజరవలసి ఉండగా కొద్దిమంది అధికారులు మాత్రమే హాజరు అయ్యారు. గ్రామస్తులు కూడా అతి కొద్దిమంది హాజరవ్వడంతో దళిత సంఘాల నాయకులు అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జ్ ఎంపీడీవో ఎండి బషీరుద్దీన్, గిర్ధవార్2 అరుణ, విద్యుత్ శాఖ ఏ ఈ కుమారస్వామి, గ్రామ ఇన్చార్జి కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మాత్రమే హాజరయ్యారు. కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరవ్వడంతో ఈ కార్యక్రమం బోసిపోయింది. దళితులకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖ నుంచీ కూడ ఎవరు హజరుకాకపోవడము గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు గొట్టే అర్జున్, ఆరేపల్లి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి బరిలో వెంకీ పాన్ ఇండియా మూవీ

స్టార్ హీరో వెంకటేష్ గతేడాది ఎఫ్3 సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్నారు. ఈ చిత్రం తర్వాత ఆయన తదుపరి ప్రాజెక్టు గురించి ఇటీవల ప్రకటించాడు. ఇటీవలే హిట్ 2 సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్న సైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేష్ ఓ సినిమా చేయబోతున్న విషయాన్ని వెల్లడించారు. హిట్ సిరీస్తో గుర్తింపు తెచ్చుకున్న సైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేష్ చేయబోయే సినిమాకు సైంధవ్ అనే టైటిల్ను ఖరారు చేశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ గ్లింప్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో వెంకీ లుక్ కు అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇక ఈ సినిమా నుంచి ఓ విషయం బయటకు వచ్చింది. సినిమా వర్గాల సమాచారం మేరకు.. ఈ సినిమా సంక్రాంతి బరిలో ఉంటుందని




తెలుస్తోంది. ఈ ఏడాది సంక్రాంతి వార్ లో బాలయ్య చిరు పోటీ పడ్డారు. బాలయ్య వీర సింహా రెడ్డి గా వస్తే... చిరు వాల్తేరు వీరయ్య గా వచ్చి ఇద్దరు హిట్ కొట్టారు. ఇక విజయ్ వారసుడు గా అజిత్ తెగింపు గా వచ్చి పర్వాలేదని పించరు. ఇక నెక్స్ట్ సంక్రాంతి బరిలో బాలయ్య 108 ఉంటుందని తెలుస్తోంది. బాలయ్య 108 సినిమా అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఇదే బరిలో చెర్రీ బన్నీ కూడా నిలిచే అవకాశం ఉంది. చరణ్ %తీష%15 బన్నీ పుష్ప 2 సినిమాలు కూడా సంక్రాంతి బరిలో ఉన్నట్లు సమాచారం. ఇక వీరితో సైందవ్ గా వెంకీ పోటీ పడితే ... ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ సినిమాను నిహారిక ఎంటర్టైన్ మెంట్ పై వెంకట్ బోయినపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది వెంకటేష్ నటించబోయే 75వ సినిమా కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్గా ఈ సినిమాకు సైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్ లో తెలుగుతో పాటు హిందీ తమిళం కన్నడ మలయాళ భాషల్లో ఇది రానుంది. ఈ చిత్రానికి సంతోష్ నారాయణ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. త్వరలోనే రెగ్యూలర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇక వెంకీ రానా తో కలిసి రానా నాయుడు అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్నారు.

# టైగర్ పని పూర్తి చేసిన రేణు దేశాయ్..



రేణూ దేశాయ్... రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారుండరు అంటే అతిశయోక్తి కాదు. ఈమె వెండితెరపై కనిపించక చాలా ఏళ్లు గడుస్తున్నా ప్రేక్షకులు మాత్రం ఆమెను ఇప్పటికీ మరిచిపోలేరు. చివరగా పవన్ కల్యాణ్ తో కలిసి జానీ సినిమాలో నటించిన ఈమె.. మళ్లీ సినిమాల్లో కనిపించలేదు. పవన్ కల్యాణ్ తో పెళ్లి పిల్లలతో బిజీగా గడిపింది. పవర్ స్టార్ తో విడాకులు తీసుకున్న తర్వాత ఓ సినిమాను డైరెక్ట్ చేయాలని చాలానే కలలు కంది. కానీ పలు కారణాల వల్ల అది అలాగే ఆగిపోయింది. అప్పుడప్పుడూ పలు టీవీ షోలు వెబ్ సిరీస్ లలో కనిపిస్తున్న రేణూ దేశాయ్... ఆద్య అనే వెబ్ సిరీస్ ను కూడా ప్రారంభించింది. కానీ అది మధ్యలోనే ఆగిపోయినట్లు తెలుస్తోంది. కరోనా వల్ల మరింత ఆలస్యం అవుతుండటంతో మధ్యలోనే అటకెక్కినట్లు కనిపిస్తోంది. అయితే ప్రస్తుతం రేణూ దేశాయ్... రవితేజ టైగర్ నాగేశ్వర రావు సినిమాలో నటిస్తుందనే విషయం అందరికీ తెలిసిందే. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే రేణూ దేశాయ్ తాజాగా టైగర్ నాగేశ్వర రావు సినిమాకు సంబంధించి ఓ పోస్ట్ పెట్టింది. రవితేజ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో హేమలతా లవణం అనే పాత్రలో రేణూ దేశాయ్ కనిపించబోతున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు ఈ పాత్రకు సంబంధించిన షూటింగ్ అయిపోయినట్టుగా రేణూ దేశాయ్ తెలిపింది. ఇంత మంచి పాత్ర ఇచ్చినందుకు పవర్ ఫుల్ రోల్ ఇచ్చినందుకు డైరెక్టర్ వంశీ కృష్ణకు థాంక్స్ చెప్పింది. అభిషేక్ అగర్వాల్ వారి వల్లే ఈ యూనిట్ అంతా కూడా తనకు ఫ్యామిలీలా మారిందని రాసుకొచ్చింది. ఎంతో కంఫర్ట్ గా పని చేశానని వివరించింది. తన పాత్రకు సంబంధించిన షూటింగ్ జరిగే ప్రతీ క్షణం నేను ఎంజాయ్ చేశానంటూ ఇన్ స్టా వేదికగా వెల్లడించింది. అయితే రేణూ దేశాయ్ అభిమానులతో పంచుకున్న ఈ పోస్టులో ఎక్కడా హీరో రవితేజ పేరు ప్రస్తావించలేదు.

## మన జక్కన్నపై బాలీవుడ్ డైరెక్టర్ ఆశ్చర్యకర వ్యాఖ్యలు



టాలీవుడ్ జక్కన్న రాజమౌళి పేరు ఈ మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా మారు మ్రోగుతూనే ఉంది. అంతర్జాతీయ స్థాయి మీడియా సంస్థలు గత కొన్నాళ్లుగా ఆర్ఆర్ఆర్ సినిమాపై పెద్ద ఎత్తున కథనాలు ఇస్తూనే ఉన్నాయి. తాజాగా ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాట ఆస్కార్ అవార్డ్ కి నామినేట్ అవ్వడంతో మరింతగా జక్కన్న యొక్క పేరు మారు మ్రోగుతోంది అనడంలో సందేహం లేదు. ఎంతో మంది ప్రముఖ ఫిల్మ్ మేకర్స్ కూడా జక్కన్న రాజమౌళి పై ప్రశంసలు కురిపించడం జరుగుతోంది. బాలీవుడ్ లోనే దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్. ఇండియాలోనే గొప్ప దర్శకుల్లో ఆయన ఒకడు. ఆయన తీసిన సినిమాలో ఒక అద్భుతం అన్నట్లుగా ఆయన అభిమానులు అంటూ ఉంటారు. అలాంటి అనురాగ్ కశ్యప్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో జక్కన్న ను ఆకాశానికి ఎత్తేల వ్యాఖ్యలు చేశాడు. రాజమౌళి మన ఇండియన్ సినిమాలను హాలీవుడ్ వారికి కూడా నచ్చే విధంగా తీశాడు. అది కూడా తక్కువ బడ్జెట్ లో హాలీవుడ్ వారికి నచ్చే విధంగా సినిమాలు తీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకే ఇండియన్ సినిమాలు అంటే ఇప్పుడు హాలీవుడ్ వారికి చాలా ఆసక్తి క్రియేట్ అయ్యిందని అనురాగ్ కశ్యప్ పేర్కొన్నాడు. ఇకపై హాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ తమ సినిమాల యొక్క మేకింగ్ కోసం తప్పనిసరిగా రాజమౌళిని సంప్రదిస్తారు అని తాను భావిస్తున్నాను అన్నట్లుగా కూడా పేర్కొన్నాడు. రాజమౌళి మార్వెల్ మరియు డీసీ సినిమాలను తీయగల సమర్థుడు అంటూ ఆశ్చర్యకర వ్యాఖ్యలను అనురాగ్ కశ్యప్ చేయడం జరిగింది. రాజమౌళి యొక్క స్టామినా ఏంటో అనురాగ్ కశ్యప్ యొక్క వ్యాఖ్యలను చూస్తే అర్థం అవుతోంది.

# 'పుష్ప 2'.. ఇంటర్వెల్ బ్యాంగ్ ఫ్యాన్స్ కి కేకలేనటగా!

'పుష్ప ది రైజ్' మూవీతో టాలీవుడ్ క్రేజీ స్టార్ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా వైడ్ గా పాపులారిటీని దక్కించుకున్నాడు. స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో మైత్రీమూవీ మేకర్స్ వారు అత్యంత భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా నిర్మించిన ఈ సినిమా వరల్డ్ వైడ్ గా భారీ విజయాన్ని దక్కించుకుంది. ఉత్తరాదిలో ఊహకందని విధంగా వసూళ్ల వర్షం కురిపించి బాలీవుడ్ ట్రేడ్ వర్గాలని విస్మయానికి గురిచేసింది. దీంతో 'పుష్ప 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా పై వున్న క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు సుకుమార్ ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో ఎవరూ ఊహించని విధంగా తెరపైకి తీసుకొస్తున్నారు. పార్ట్ 1 లో డైలీ కూలీ తన యాటిట్యూడ్ తో తెగింపుతో సిండికేట్ స్మగ్లర్ గా ఎదిగిన క్రమాన్ని చూపించగా.. 'పుష్ప 2'లో మాత్రం ఆ సిండికేట్ ని ఏలే వ్యక్తి వరల్డ్ వైడ్ గా మోస్ట్ వాంటెడ్ రెడ్ సాండల్ సామ్రాజ్యానికి డాన్ గా అవతరించిన క్రమాన్ని దేశ విదేశాల్లో నెట్ వర్క్ ని క్రియేట్ చేసుకున్న క్రమాన్ని చూపించబోతున్నారట. ఇదిలా వుంటే ఇటీవల అదిగో ఇదిగో అంటూ సాగదీస్తున్న ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఇటీవల వైజాగ్ లో మొదలైంది. అక్కడ భారీ స్థాయిలో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సాంగ్ తెరకెక్కించారట. సినిమాకు ఇది ప్రత్యేక హైలైట్ గా నిలుస్తుందని ఇన్ సైడ్ టాక్. ఇదిలా వుంటే ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ మూవీ గురించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త హల్ చల్ చేస్తోంది. ఫస్ట్ పార్ట్ ట్రెమండస్ హిట్ గా నిలవడంతో సుకుమార్ పార్ట్ 2 ని ప్రత్యేక హంగులతో ట్విస్ట్ లతో తెరపైకి తీసుకొస్తున్నారట. ఇందులో భాగంగానే ఈ మూవీలోని ఇంటర్వెల్ బ్యాంగ్ అభిమానులతో పాటు ప్రేక్షకులని సర్ ప్రైజ్ చేస్తుందని ఓ వార్త నెట్టింట వైరల్ గా మారింది. విషయం ఏంటంటే సినిమాలో బన్నీ రెడ్ సాండల్ స్లగ్లర్ గా కనిపించనున్న వి ష య ం తెలిసిందే. అయితే కూలి కాస్త సిండికేట్ పగ్గాలని



దక్కించుకునే వ్యక్తిగా పార్ట్ 1 లో చూపించిన సుకుమార్ పార్ట్ 2లో మాత్రం బన్నీని రెడ్ సాండల్ స్మగ్లింగ్ ని దేవ విదేశాల్లో విస్తరించే డాన్ గా చూపించబోతున్నాడట. ఇంటర్వెల్ బ్యాంగ్ లో అన్ని ఈ లుక్ లో కనిపించి కేకల్ పెట్టించనున్నాడని ఈ సీన్ సినిమాకు ప్రధాన హైలైట్ గా నిలవనుందని ఇన్ సైడ్ టాక్. అంతే కాకుండా సినిమాలో పార్ట్ 1 కు మించిన స్థాయిలో కొత్త పాత్రలు వుంటాయని ఇవి సినిమాకు హైలైట్ గా నిలుస్తాయని తెలుస్తోంది. ఈ మూవీ విషయంలో సుకుమార్ భారీ ప్లాన్ తో ముందుకు వెళుతున్నాడని సినిమాని ఎవరూ ఊహించని స్టాండర్డ్స్ లో తెరపైకి తీసుకురాబోతున్నాడని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. కీలక పాత్రల్లో ఫహద్ ఫాజిల్ అనసూయ సునీల్ తదితరులు నటిస్తున్నారు. భారీ అంచనాలు నెలకొన్న ఈ మూవీని 2024 జనవరికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు.

# రాజా డీలక్స్ లో నటిస్తున్నట్లుగా చెప్పకనే చెప్పేసింది

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా గురించి ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటన రాలేదు. ఆ సినిమా షూటింగ్ విషయంలో అనేక రకాల పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఆ మధ్య ఒక షెడ్యూల్ పూర్తి అయ్యింది. మరో షెడ్యూల్ కు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో ఈ సినిమా రూపొందుతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమా లో ప్రభాస్ కు జోడీగా ముగ్గురు ముద్దుగుమ్మలు నటించబోతున్నారని చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ముగ్గురు ముద్దుగుమ్మల్లో మాస్టర్ బ్యూటీ మాళవిక మోహనన్ ఒకరు అని కూడా ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లు కూడా సినిమా గురించే అఫిషియల్ గా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఇక హీరోయిన్ విషయం క్లారిటీ లేనేలేదు. తాజాగా మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. ఆ సందర్భంగా తెలుగు సినిమా గురించి స్పందించింది. మాళవిక మోహనన్ ఒక అభిమాని తెలుగు సినిమా ఎంట్రీ ఎప్పుడు అంటూ ప్రశ్నించగా ఆమె స్పందిస్తూ.. తెలుగు సినిమాకు సంబంధించిన వర్క్ జరుగుతోంది. తప్పకుండా త్వరలోనే ఆ సినిమాను గురించి అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి అన్నట్లుగా



చెప్పుకొచ్చింది. ఈ అమ్మడు ప్రభాస్ సినిమాలో కాకుండా మరే సినిమాలో నటిస్తున్నట్లుగా వార్తలు రాలేదు. కనుక తాను తెలుగు సినిమాలో నటిస్తున్నాను అంటూ చెప్పింది కనుక అది ప్రభాస్.. మారుతి సినిమా అయ్యి ఉంటుంది అంటూ చాలా మంది భావిస్తున్నారు. రాజా డీలక్స్ టైటిల్ ను పరిశీలిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ అధికారికంగా రాలేదు.

# దిల్ రాజ్ మాస్టర్ ప్లాన్... ఈ సారి రజనీకాంత్ పై ఫోకస్



డిస్ట్రిబ్యూటర్గా ప్రస్థానం మొదలుపెట్టిన దిల్ రాజు.. ప్రస్తుతం టాప్ మోస్ట్ ప్రొడ్యూసర్గా కొనసాగుతున్నారు. నిర్మాతగా ఎన్ని విజయాలు సాధించినా డిస్ట్రిబ్యూషన్ను మాత్రం వదిలిపెట్టలేదు. ముఖ్యంగా నైజాం వైజాగ్ ఏరియాల్లో థియేటర్లపై ఆయనకు మంచి పట్టు ఉందనే చెప్పవచ్చు. దీంతో చాలా సినిమాల రిలీజ్లను శాసించే స్థాయిలో ఉన్నారు దిల్ రాజు. ఇలా టాలీవుడ్లో సాఫీగా జర్నీ సాగిస్తున్న ఆయనకు ఈ సంక్రాంతి ఫలితాలు మింగుడుపడటం లేదనే చెప్పవచ్చు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్తో ఆయన నిర్మించిన 'వారసుడు' చిత్రాన్ని తెలుగులో విడుదల చేశాడు. వారసుడు చిత్రాన్ని జనవరి 14న విడుదల చేయగా.. తెలుగులో బాక్స్ ఆఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఎందుకంటే చిరంజీవి 'వాల్తేర్ వీరయ్య'తో పాటు బాలకృష్ణ 'వీరసింహా రెడ్డి' చిత్రాలు ఉండటమే అందుకు కారణం. కానీ తమిళనాడులో మాత్రం కలెక్షన్లు బాగానే రాబట్టింది. అయితే ఈ సంక్రాంతికి తన అంచనా తప్పయిందని రియలైజ్ అయిన దిల్ రాజు.. ఈ విషయంలో తప్పు ఎక్కడ జరిగిందో విశ్లేషించే పనిలో పడ్డారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే దిల్ రాజు తాజాగా మరో తమిళ స్టార్ పై ఫోకస్ చేస్తున్నట్లు సమాచారం. వారీసు చిత్రంతో తమిళ నిర్మాతగా తమిళనాడులో ఎంటర్ అయ్యారు. ఇప్పుడు మరో స్టార్ హీరో పై దృష్టి పెడుతున్నారు. ఆయన ఎవరో కాదు సూపర్ స్టార్ రజనీకాంత్. ఈ హీరో నటిస్తున్న తాజా చిత్రం జైలర్. ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూషన్ రైట్స్ ను దిల్ రాజు కొనడానికి ప్రయత్నిస్తున్నారు అని తెలుస్తోంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ టాలీవుడ్ యాక్టర్ సునిల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే జైలర్ సెట్స్ నుంచి విడుదలైన మోహన్ లాల్ సునిల్ స్టిల్స్ నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రంలో మిల్కీ బ్యూటీ తమన్నా బాటియా మరో కీ రోల్ చేస్తోంది. జైలర్ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్పై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 11న రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక ఇదే ఆగస్ట్ 11న %యావీదీ% 28 సినిమా రిలీజ్ అవుతున్నట్లు తెలుస్తోంది. మహేష్ త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న ఈ చిత్రాన్ని నాగవంశి నిర్మిస్తున్నారు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB · SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989